www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 09 | శనివారం | 8 ఆగస్టు, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

## ఎన్‌టీఏ నిపుణులే..

# నీట్ లీక్ సూత్రధారులు!

### ముగ్గురు నిపుణుల నుంచి మధ్యవర్తులకు ప్రశ్నపత్రం

- రూ.10–12 లక్షలకు బేరసారాలు
- ఫోరెన్సిక్ పరీక్షల్లోనూ కీలక ఆధారాలు
- సీబీఐ చార్జిషీట్‌లో సంచలన విషయాలు
- ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తుది నివేదిక

2







నీట్–యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి చెందిన ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులే కీలక పాత్ర పోషించినట్లు సీబీఐ తన చార్జిషీట్‌లో సంచలన విషయాలను వెల్లడించింది. కెమిస్ట్రీ నిపుణుడు పి.వి. కులకర్ణి, ఫిజిక్స్ నిపుణురాలు మనీషా సంజయ్ హవల్దార్, బోటనీ, జువాలజీ నిపుణురాలు మనీషా గురునాథ్ మాంధారే ప్రశ్నలను బయటకు తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొంది. ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల్లో అక్రమ మార్గాల వినియోగానికి సంబంధించిన కేసులో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు సీబీఐ ఇటీవల తుది నివేదిక సమర్పించింది.




## రష్యా చమురు కొంటే

### అమెరికా సెనేట్‌లో 86–11తో బిల్లు ఆమోదం

# 100% సుంకం!

- భారత్, చైనాతో పాటు ఐదు దేశాలకు వర్తించే అవకాశం
- ఈ నెల 31న ప్రతినిధుల సభ ముందుకు బిల్లు

**వాషింగ్టన్:** రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా కొరడా ఝుళిపించేందుకు రంగం సిద్ధమైంది. రష్యా ఇంధనాన్ని అధికంగా దిగుమతి చేసుకునే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కల్పించే బిల్లును అమెరికా సెనేట్ 86–11 ఓట్ల తేడాతో ఆమోదించింది. 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'గా పేరు మార్చిన ఈ బిల్లు.. ఇక ప్రతినిధుల సభ ఆమోదం పొందాల్సి ఉంది. రష్యా చమురు, గ్యాస్‌ను అత్యధికంగా దిగుమతి చేసుకునే తొలి ఐదు దేశాల జాబితాలో చైనా, భారత్, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా ఉన్నాయి. ఈ దేశాల నుంచి అమెరికాకు వచ్చే వస్తువులపై 100 శాతం సుంకాలు విధించే అధికారం ట్రంప్‌కు బిల్లు కల్పిస్తోంది.

#### పుతిన్, రష్యా సంస్థలపైనా ఆంక్షలు

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఆ దేశ అధికారులు, సంపన్న వ్యాపారవేత్తలు (ఒలిగార్క్‌లు), ఆర్థిక సంస్థలపై అదనపు ఆంక్షలు విధించే నిబంధనలు కూడా బిల్లులో ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధానికి రష్యా ఆర్థిక వ్యవస్థకు మద్దతిస్తున్న దేశాలను లక్ష్యంగా చేసుకోవడమే దీని ఉద్దేశమని సెనేటర్లు పేర్కొన్నారు.

ఇదిలాఉంటే సెనేట్ ఆమోదించిన ఈ బిల్లు ఆగస్టు 31న ప్రతిని ధుల సభ సమావేశమైన తర్వాత అక్కడ పరిశీల నకు రానుంది. అయితే, అధ్యక్షుడికి విస్తృతంగా సుంకాలు విధించే అధికారం ఇవ్వడం ప్రమాదకరమని కొందరు డెమోక్రాట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### ఇరాన్‌పైనా చర్యలు

1996 నాటి ఇరాన్ ఆంక్షల చట్టం గడువును 2031 వరకు పొడిగించే ప్రతిపాదన కూడా ఈ బిల్లులో ఉంది. ఇరాన్ ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

## జీఎస్టీ ఆదాయానికి..

# ఏఐ అస్త్రం!

### పన్ను లీకేజీలకు చెక్ పెట్టేందుకు సమీకృత వ్యవస్థ

- భవన నిర్మాణ అనుమతుల దశలోనే పన్నుల అంచనాలు నమోదు
- ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సీఎం రేవంత్ కీలక చర్చలు



ప్రజానావ, హైదరాబాద్:

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు జీఎస్టీ ఆదాయాన్ని పెంచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పన్ను లీకేజీలను అరికట్టడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం, వ్యాపారాలకు ఇబ్బందులు కలగకుండా ఆదాయాన్ని పెంచేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో చర్చించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉన్నతాధికారులతో అరవింద్ సుబ్రమణియన్ సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, ఆదాయ వనరులను పెంచే మార్గాలపై విస్తృతంగా చర్చించారు.అధికారులకు ఏఐ ఆధారిత సమాచారంజీఎస్టీ అధికారులకు ఏఐ ఆధారిత సమాచారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి పన్నుల వసూళ్ల ప్రక్రియను మరింత సులభతరం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఆదాయం పెంచే క్రమంలో వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచడంతో పాటు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను మెరుగుపరిచేలా సాంకేతికతను వినియోగించాలని తరువాయి 2లో..

## మహా క్రతువు

- వర్షాలు సమృద్ధిగా కురవాలని ఈ నెల 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం
- రాష్ట్రం సుభిక్షం ఉండాలని, రైతాంగ శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రత్యేక సంకల్పం
- 11 హోమకుండాల్లో 108 మంది రుత్వికులతో నిర్వహణ
- పూర్ణాహుతికి హాజరు కానున్న ముఖ్యమంత్రి రేవంత్

2

### జన్మహక్కు పౌరసత్వానికి

## ట్రంప్ బ్రేక్!



- అమెరికాలో పుట్టిన వారికి పౌరసత్వంపై కొత్త ఆంక్షలు
- బర్త్ టూరిజం లక్ష్యంగా ఉత్తర్వులు

6




# ఏ పార్టీతో పొత్తు పెట్టుకోం

- తెలంగాణలో అధికారం మాదే
- జనసేనతోనూ కలిసేది లేదు
- ఎన్డీయేలో జనసేన భాగస్వామి.. జాతీయస్థాయిలోనే నిర్ణయం
- 937 మండలాల్లో పార్టీ బలోపేతమే లక్ష్యం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

2

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని తేల్చి చెప్పారు. జనసేనతోనూ రాష్ట్రస్థాయిలో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. అయితే జనసేన ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా ఉందని, ఆ పార్టీతో సంబంధాలపై నిర్ణయం జాతీయస్థాయిలోనే ఉంటుందని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో తెలంగాణకు చెందిన పార్టీ ముఖ్య నేతలతో సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు పాల్గొన్నారు.




### మెటాకు

## భారీ షాక్!

- రూ.4,700 కోట్ల జరిమానా విధించిన న్యూ మెక్సికో కోర్టు
- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తో యువతకు నష్టమని నిర్ధారణ
- చికిత్స, అవగాహనకు నిధుల వినియోగం

2

# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

**లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ**



**న్యూఢిల్లీ :** హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి టాయించినట్లు ంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు ంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్ఆర్టీసీ గతంలో హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, వలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్ఎంటీ భూముల కు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్ ఆర్టీసీకి టాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడు తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను డా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# హిందూజా సోదరులకు ఊరట

- బోఫోర్స్ కేసును కొట్టేసిన సుప్రీం
- 40 ఏళ్ల బోఫోర్స్ కేసుకు పడిన తెర

**న్యూఢిల్లీ :** దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో డిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటి చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సీబీఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని సులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతో పాటు స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ కంపెనీపై ఉన్న క్రిమినల్ సులను కొట్టివేసింది. అప్పట్లో దర్యాప్తు తీరుపై డా సీబీఐని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది.

# ఈ20పై అపోహలకు చెక్

- కలుషితం కాదన్న చమురు సంస్థలు
- దేశవ్యాప్తంగా పరీక్షల్లో నాణ్యతా ప్రమాణాలకే మద్దతు
- తేమ, క్లోరైడ్ ఆరోపణలకు ఆధారాల్లేవని స్పష్టీకరణ




**న్యూఢిల్లీ:** ఈ20 పెట్రోల్‌లో తేమ, క్లోరైడ్ కలుషితం ఉందన్న ప్రచారాన్ని ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఖండించాయి. దేశవ్యాప్తంగా రిఫైనరీలు, డిస్టిలరీలు, డిపోలు, టెర్మినల్స్, పెట్రోల్ బంకుల్లో నిర్వహించిన విస్తృత పరీక్షల్లో ఇంధన నాణ్యత అన్ని దశల్లోనూ నిర్దేశిత ప్రమాణాల్లోనే ఉన్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. తేమ లేదా క్లోరైడ్ కలుషితం అధికంగా ఉందన్న వాదనలకు శాస్త్రీయ పరీక్షల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేశాయి. ఇటీవల వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో రిఫైనరీల నుంచి సేకరించిన 100కుపైగా పెట్రోల్ నమూనాల్లో క్లోరైడ్ స్థాయిలు 1 పీపీఎం లోపే నమోదయ్యాయి. గత 10 రోజుల్లో 80 డిస్టిలరీలు, 80 డిపోలు, టెర్మినల్స్ నుంచి సేకరించిన నమూనాల్లో కూడా క్లోరైడ్ మోతాదు 3 పీపీఎంకు మించలేదని వెల్లడించాయి. అలాగే దేశవ్యాప్తంగా 160కుపైగా ఈ20 నమూనాల్లో క్లోరైడ్ స్థాయిలు 0–3 పీపీఎం మధ్యే నమోదయ్యాయని, వందల పీపీఎంలు ఉన్నాయన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నాయి. పరీక్షల్లో కేవలం రెండు ప్రాంతాల్లో మాత్రమే క్లోరైడ్ స్థాయిలు అధికంగా గుర్తించామని, వెంటనే అక్కడ ఇంధన సరఫరాను నిలిపివేసి కారణాలపై విచారణ ప్రారంభించినట్లు సంస్థలు తెలిపాయి. దేశంలోని సుమారు 90 వేల పెట్రోల్ బంకుల్లో భూగర్భ నిల్వ ట్యాంకులను రోజుకు 8 నుంచి 12 సార్లు తనిఖీ చేస్తున్నామని, ఇప్పటివరకు నీరు చేరిన ఘటన ఏదీ గుర్తించలేదని వివరించాయి.

## వివాదం సృష్టించే ప్రయత్నాలు

కేంద్ర చమురు మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి కూడా ఈ20 ఇంధన నాణ్యతపై అనవసర వివాదం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా 1.07 లక్షల పెట్రోల్ బంకుల్లో నిర్వహించిన తనిఖీల్లో కేవలం నాలుగు చోట్ల మాత్రమే సమస్యలు గుర్తించామని తెలిపారు. ఈ20 పెట్రోల్ నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు పూర్తిగా అనుగుణంగా ఉందని, వినియోగదారులు ఎలాంటి సందేహం లేకుండా ఉపయోగించవచ్చని చమురు సంస్థలు స్పష్టం చేశాయి.

# మహా క్రతువు

- వర్షాలు సమృద్ధిగా కురవాలని ఈ నెల 10న నాగార్జునసాగర్‌లో వరుణ యాగం
- రాష్ట్రం సుభిక్షం ఉండాలని, రైతాంగ శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రత్యేక సంకల్పం
- 11 హోమకుండాల్లో 108 మంది రుత్వికులతో నిర్వహణ
- పూర్ణాహుతికి హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ మహా క్రతువు జరగనుంది. కృష్ణా, గోదావరి నదులు పుష్కలంగా ప్రవహించడంతో పాటు రాష్ట్రంలో పంటలు సమృద్ధిగా పండాలని, ఎల్‌నినో ప్రభావం నుంచి రాష్ట్రానికి ఉపశమనం కలగాలని ప్రత్యేక సంకల్పం తో యాగాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాల్లో యాగాన్ని నిర్వహించనున్నారు. వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సకాలంలో వర్షాలు, పంటల సమృద్ధి, జలవనరుల అభివృద్ధిని కాంక్షిస్తూ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

# ఎన్‌టీఏ నిపుణులే.. నీట్ లీక్ సూత్రధారులు!

- ముగ్గురు నిపుణుల నుంచి మధ్యవర్తులకు ప్రశ్నపత్రం
- రూ.10–12 లక్షలకు బేరసారాలు
- ఫోరెన్సిక్ పరీక్షల్లోనూ కీలక ఆధారాలు
- సీబీఐ చార్జిషీట్‌లో సంచలన విషయాలు

**న్యూఢిల్లీ:** నీట్–యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి చెందిన ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులే కీలక పాత్ర పోషించినట్లు సీబీఐ తన చార్జిషీట్‌లో సంచలన విషయాలను వెల్లడించింది. కెమిస్ట్రీ నిపుణుడు పి.వి. కులకర్ణి, ఫిజిక్స్ నిపుణురాలు మనీషా సంజయ్ హవల్దార్, బోటనీ, జువాలజీ నిపుణురాలు మనీషా గురునాథ్ మాంధారే ప్రశ్నలను బయటకు తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొంది. ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల్లో అక్రమ మార్గాల వినియోగానికి సంబంధించిన కేసులో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు సీబీఐ ఇటీవల తుది నివేదిక సమర్పించింది.

## రఫ్ షీట్లపై ప్రశ్నలు రాసి బయటకు..

ఎన్‌టీఏ రహస్య విభాగంలో ప్రశ్నల అనువాదం, తిరిగి అనువాదం కోసం నిపుణులకు రఫ్ వర్క్ చేసుకునేందుకు తెల్లకాగితాలు ఇచ్చేవారు. ఈ అవకాశాన్ని కులకర్ణి దుర్వినియోగం చేసినట్లు సీబీఐ పేర్కొంది. కెమిస్ట్రీకి సంబంధించిన 135 ప్రశ్నలను సమాధానాల ఎంపికలతో సహా చిన్న కాగితాలపై సంక్షిప్తంగా రాసుకుని రహస్యంగా బయటకు తీసుకెళ్లినట్లు తెలిపింది. నిపుణులు లోపలికి వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు తనిఖీలు, ఫ్రిస్కింగ్ లేకపోవడాన్ని ఆయన అనుకూలంగా ఉపయోగించుకున్నారని చార్జిషీట్‌లో పేర్కొంది.

## హోటల్ గదుల్లో ప్రశ్నల పునర్నిర్మాణం

కులకర్ణి సులభంగా గుర్తుపెట్టుకున్న ప్రశ్నలను హోటల్‌కు వెళ్లిన తర్వాత రాసుకున్నారని సీబీఐ తెలిపింది. బోటనీ, జువాలజీ అనువాదకురాలిగా పనిచేసిన మాంధారే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో సంబంధిత అంశాలను గుర్తించి వాటి ఆధారంగా ప్రశ్నలను పునర్నిర్మించేవారని పేర్కొంది. ఫిజిక్స్ అనువాద బాధ్యతలు నిర్వహించిన హవల్దార్ కూడా రోజువారీ పని ముగిసిన తర్వాత ఢిల్లీలోని తన బసకు వెళ్లి ప్రశ్నలను సంక్షిప్తంగా రాసుకునేవారని వెల్లడించింది. ఎన్‌టీఏ కార్యాలయంలో ప్రత్యేక సీసీటీవీ లైవ్ మానిటరింగ్ కంట్రోల్ రూమ్ లేకపోవడంతో ఈ వ్యవహారం గుర్తించలేకపోయినట్లు సీబీఐ తెలిపింది. నిపుణులు సేకరించిన ప్రశ్నలు మధ్యవర్తులు, వారి సహాయకుల ద్వారా ముందుకు వెళ్లినట్లు చార్జిషీట్‌లో వివరించింది. తేజస్ హర్షద్కుమార్ షా, డాక్టర్ మనోజ్ బహ్వాన్‌రావ్ శిరూరే, శివరాజ్ మోతేగావ్‌కర్, ధనంజయ్ నివృత్తి లోఖండే తదితరుల ద్వారా ప్రశ్నలు ఇతరులకు చేరినట్లు పేర్కొంది.

## ఒక్కో అభ్యర్థి నుంచి భారీగా వసూలు

శుభమ్ మాధుకర్ ఖైర్నార్, మంగీలాల్ బివాల్, దినేశ్ బివాల్, వికాస్ బివాల్, హరియాణాకు చెందిన యశ్ యాదవ్ తదితరులు చివరకు అభ్యర్థులకు ప్రశ్నలను చేరవేసినట్లు సీబీఐ తెలిపింది. ఖైర్నార్ అభ్యర్థులను సంప్రదించి డబ్బులు తీసుకోవడంతోపాటు విద్యా ధ్రువపత్రాలు, ఖాళీ చెక్కులను భద్రతగా తీసుకున్నట్లు పేర్కొంది. పరీక్షకు నాలుగు రోజుల ముందే ప్రశ్నపత్రాన్ని పీడీఎఫ్ లేదా హార్డ్‌కాపీ రూపంలో అందిస్తామని చెప్పి, ఒక్కో అభ్యర్థి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు డిమాండ్ చేసినట్లు ఆడియో రికార్డుల్లో వెల్లడైందని చార్జిషీట్‌లో వివరించింది.

## చేతిరాతలతోనూ నిర్ధారణ

లీకేజీ కుట్రలో మనీషా సంజయ్ వాఘ్‌మారే కీలక పాత్ర పోషించినట్లు సీబీఐ పేర్కొంది. ఆమె సబ్జెక్ట్ నిపుణులు, అభ్యర్థుల మధ్య వారధిగా వ్యవహరించినట్లు తెలిపింది. ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించిన ఆధారాలను కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబొరేటరీకి చెందిన ప్రభుత్వ ప్రశ్నిత పత్రాల పరిశీలన విభాగం (జీఈక్యూఈడీ) కూడా ధ్రువీకరించినట్లు చార్జిషీట్‌లో పేర్కొంది. స్వాధీనం చేసుకున్న పలు ప్రశ్నపత్రాలపై ఉన్న చేతిరాతలు సంబంధిత నిపుణుల చేతిరాతలతో సరిపోలినట్లు ఫోరెన్సిక్ పరీక్షల్లో నిర్ధారణ అయిందని సీబీఐ వెల్లడించింది.



# తార్నాక అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**ప్రజానావ, సికింద్రాబాద్ :** తార్నాకలో వివిధ అభివృద్ధి పనులను తామే ప్రారంభించామని, స్థానికుల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలను కల్పిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. తార్నాక అసోసియేషన్ ఫర్ సర్వీస్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) నూతన కమిటీ సభ్యులు శుకరవరం సీతాఫలమండీ లోని క్యాంపు కార్యాలయంలో పద్మారావుగౌడ్‌తో సమావేశమయ్యారు. ఆయనను సత్కరించారు. టాస్క్ అధ్యక్షురాలు సీ. మంజుల, ప్రధాన కార్యదర్శి దస్త గిరి అలీ, నేతలు ముజాహిద్, ఖలీద్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధ్యక్షురాలు మంజుల నూతన కమిటీ సభ్యులను పద్మారావు గౌడ్ అభినందించారు. తార్నాక అభివృద్ధిలో తమ పాత్ర కొనసాగుతుందని, తమ సమస్యలకు సీతాఫలమండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని పద్మారావు గౌడ్ సూచించారు.

# మెటాకు భారీ షాక్!

- రూ.4,700 కోట్ల జరిమానా విధించిన న్యూ మెక్సికో కోర్టు
- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తో యువతకు నష్టమని నిర్ధారణ
- పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రతకు హాని కలిగించడంపై ఆగ్రహం
- చికిత్స, అవగాహనకు నిధుల వినియోగం

**శాంటా ఫే:** పిల్లలు, యువత మానసిక ఆరోగ్యం, భద్రతకు హాని కలిగించేలా తమ ప్లాట్‌ఫామ్‌లను నిర్వహించినందుకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటాకు న్యూ మెక్సికో కోర్టు 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,700 కోట్ల) జరిమానా విధించింది. గురువారం వెలువరించిన తీర్పులో ఈ మొత్తాన్ని రానున్న ఐదేళ్లలో యువతకు చికిత్స, అవగాహన, నివారణ, స్క్రీనింగ్ సేవలకు వినియోగించాలని న్యాయమూర్తి బ్రయాన్ బీడ్‌షీడ్ ఆదేశించారు. జరిమానాలో అత్యధికంగా 420 మిలియన్ డాలర్లు యువతకు చికిత్స అందించే సేవలకు కేటాయించనున్నారు. మిగిలిన మొత్తాన్ని అవగాహన కార్యక్రమాలు, నివారణ చర్యలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర వ్యయాలకు వినియోగించనున్నారు. ఈ కేసు తొలి దశ విచారణలోనే మెటాకు 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించారు. పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలుగుతోందని తెలిసినా సంస్థ చర్యలు తీసుకోలేదని, ప్లాట్‌ఫామ్‌లలో పిల్లల లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని జ్యూరీ నిర్ధారించింది. పిల్లలను ఆకర్షించే, వ్యసనంగా మారే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ వ్యవస్థను మెరుగుపరచాలని, డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులు, కఠిన పర్యవేక్షణ ద్వారా పిల్లల లైంగిక దోపిడీని అడ్డుకోవాలని ప్రాసిక్యూటర్లు కోర్టును కోరారు.

## వయసు నిర్ధారణపై పరిమితులు

అయితే ఫెడరల్ చట్టాల ప్రకారం 13ఏళ్లలోపు పిల్లలపై వయసు నిర్ధారణ కోసం వ్యక్తిగత సమాచారాన్ని తప్పనిసరిగా కోరడం లేదా వారిని ఆన్‌లైన్‌లో పరోక్షంగా ట్రాక్ చేయడం మెటాకు సాధ్యం కాదని కోర్టు పేర్కొంది. ఇతర సోషల్ మీడియా సంస్థలకు వర్తించని నిబంధనలను కేవలం మెటాపై విధించడం సంస్థకు అన్యాయంగా, నష్టదాయకంగా మారుతుందని కూడా న్యాయస్థానం అభిప్రాయపడింది.

# విద్యార్థుల ఫీజులు డిస్‌ప్లే చేయాలి

**ప్రజానావ, హైదరాబాద్ :** విద్యార్థుల పాఠశాల ఫీజుల వివరాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను డిస్ప్లే చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. పాఠశాల నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌తో పాటు పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లోనూ పొందుపరచాలని స్పష్టం చేసింది.

# అన్ని మతాల పండుగలకు ప్రోత్సాహం

**బోనాలు నిధుల చెక్కుల పంపిణీ చేసిన పద్మారావు గౌడ్**



**ప్రజానావ, సికింద్రాబాద్ :** అన్ని మతాలకు తెలంగాణ రాష్ట్రంలో తగిన ప్రాముఖ్యతను కల్పించి బోనాలు పండుగ ఖ్యాతిని పెంచిన ఘనత తమకే ఉందని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ పరిధిలో బోనాలు సందర్భంగా వివిధ దేవాలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం మధురానగర్ కాలనీ కమ్యూనిటి హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ పాల్గొని, శాసన మండలి సభ్యులు బల్మూరి వెంకట్ తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని సుమారు 212 దేవాలయాలకు దాదాపు రూ. కోటీ 12 లక్షలకు పైగా చెక్కులను పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా అందించారు. అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు పాటించని పక్షంలో కటినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులు పొందే వారు దళారీలను ఆశ్రయించరాదని, ఎవరైనా డబ్బులు డిమాండు చేసే పక్షంలో సీతాఫలమండీ లోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని పద్మారావు గౌడ్ సూచించారు. బీ. ఆర్. ఎస్. యువ నేతలు తీగుళ్ళ కిశోర్ కుమార్, రామేశ్వర గౌడ్, తాజా మాజీ కార్పొరేటర్లు సామాల హేమ, కంది శైలజ, రాసురి సునీత, లింగని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏ పార్టీతో పొత్తు పెట్టుకోం

- తెలంగాణలో అధికారం మాదే
- జనసేనతోనూ కలిసేది లేదు
- ఎన్డీయేలో జనసేన భాగస్వామి.. జాతీయస్థాయిలోనే నిర్ణయం
- 937 మండలాల్లో పార్టీ బలోపేతమే లక్ష్యం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**న్యూఢిల్లీ:** తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని తేల్చి చెప్పారు. జనసేనతోనూ రాష్ట్రస్థాయిలో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. అయితే జనసేన ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా ఉందని, ఆ పార్టీతో సంబంధాలపై నిర్ణయం జాతీయస్థాయిలోనే ఉంటుందని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో తెలంగాణకు చెందిన పార్టీ ముఖ్య నేతలతో సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ పరిస్థితి, నియోజకవర్గాల వారీగా బలాబలాలు, సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు.

## అధికారం కోసం రోడ్‌మ్యాప్

సమావేశం అనంతరం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు పార్టీ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ సాధించిన విజయాన్ని తెలంగాణలోనూ పునరావృతం చేస్తామని పేర్కొన్నారు.

## కీలక నేతలు బీజేపీ వైపు!

రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సమయం కోసం ఎదురుచూస్తున్నారని రాంచందర్‌రావు అన్నారు. పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ సమష్టిగా పోరాడాలని నితిన్ నబీన్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు.

## మూడు నెలలకోసారి పర్యటన

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్ తెలంగాణకు వచ్చి పార్టీ నేతలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ తదితర నేతలు పాల్గొన్నారు.

# అన్ని కేసుల్లో శిక్ష పడితే జీవితాంతం జైలులోనే!

- ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియాపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- అధికారులను పదేపదే కోర్టుకు పిలవడం బాధాకరం
- కంటోన్మెంట్ బోర్డు బకాయిల కేసులో కీలక వ్యాఖ్యలు



**ప్రజానావ, హైదరాబాద్:** సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియాపై తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఉన్నతాధికారులు పదేపదే కోర్టుకు హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధా కరమని పేర్కొంది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సుల్తానియా పనిచేసిన సమయంలో ఆయనపై నమోదైన పలు కోర్టు ధిక్కరణ కేసుల్లో శిక్ష పడితే.. జీవితాంతం జైలులోనే గడపాల్సి వస్తుందని వ్యా ఖ్యానించింది. ప్రభుత్వ పరిపాలనా నిర్ణయాల్లో జరిగే తప్పులు, నిర్లక్ష్యం కారణంగానే బాధ్యతాయు తమైన అధికారులు ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకుం టున్నారని అభిప్రాయపడింది. సికింద్రా బాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెల్లించాల్సిన సుమారు రూ.33 కోట్ల స్టాంప్ డ్యూటీ సర్‌ఛార్జి బకాయిల విడుదలకు సంబంధించిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై శుక్రవారం విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. బోర్డుకు రావాల్సిన నిధులను విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందంటూ జే. రామకృష్ణ గతంలో హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేసేందుకు జూలై 10న విచారణకు సుల్తానియా హాజరుకాకపోవడంతో ఆయనపై బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. దీంతో శుక్రవారం ఆయన స్వయంగా కోర్టుకు హాజరయ్యారు.

## సంక్షేమ పథకాలపైనా వ్యాఖ్యలు

జస్టిస్ నగేష్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పరిపాలనా వ్యవస్థలో జరిగే తప్పిదాల కారణంగా ఉన్నతాధికారులు తరచూ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పేర్కొంది. అధికారులు పదేపదే కోర్టుకు హాజరయ్యే పరిస్థితులు ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇదే సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ పథకాల అమలుపైనా హైకోర్టు వ్యాఖ్యలు చేసింది. రైతు బంధు వంటి పథకాలు మంచి ఉద్దేశంతో రూపొందిం చినప్పటికీ.. లబ్ధిదారుల సరైన వర్గీకరణ లేకపోవడంతో ధనికులు, అనర్హులు కూడా ప్రయోజనాలు పొందుతున్నారని పేర్కొంది. సంక్షేమ పథకాల ఫలాలు నిజమైన పేదలు, అర్హులైన వర్గాలకే అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది.

**రూ.25 కోట్లు విడుదల**

కోర్టు ప్రశ్నలకు సుల్తానియా సమాధానమిస్తూ.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు ఇప్పటికే రూ.25 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. మిగిలిన బకాయిలను కూడా విడతల వారీగా త్వరలో చెల్లిస్తామని ధర్మాసనానికి వివరించారు. ఆయన వివరణపై సంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

# జీఎస్టీ ఆదాయానికి.. ఏఐ అస్త్రం!

(మొదటిపేజీ తరువాయి)

అరవింద్ సుబ్రమణియన్ సూచించారు.నిర్మాణ రంగంపై ప్రత్యేక దృష్టిపన్నుల లీకేజీలను అరికట్టేందుకు శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాలను తొలగించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా భవనాలు, నిర్మాణ సామగ్రికి సంబంధించిన పన్నుల లీకేజీలను నిరోధించేందుకు మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖలను ఏఐ ఆధారిత వ్యవస్థతో అనుసంధానం చేయాలని సూచించారు.భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమతుల కోసం దరఖాస్తు చేసే దశలోనే అవసరమైన నిర్మాణ సామగ్రి వివరాలు, వాటికి సంబంధించిన పన్నుల అంచనాలను నమోదు చేయాలని సీఎం చెప్పారు. ఈ సమాచారంతోపాటు మీ సేవ, ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వివరాలను కూడా సమీకృతం చేస్తే పాలనలో మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.సమావేశంలో ఉన్నతాధికారులుసీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.




# డెంగ్యూ కేసులతో అప్రమత్తం

- నల్లబెల్లిలో బాలుడికి పాజిటివ్
- 35 నమూనాల పరీక్షల్లో రెండు కేసులు నమోదు
- పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై వైద్యుల సూచనలు

**ప్రజానావ, నల్లబెల్లి:** డెంగ్యూ కేసులు నమోదవుతుండటంతో నల్లబెల్లి మండలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవల సేకరించిన 35 రక్త నమూనాలను మహాత్మా గాంధీ మెమోరియల్ ఆసుపత్రిలో పరీక్షించగా రెండు డెంగ్యూ పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయి. వాటిలో ఒకటి నల్లబెల్లి మండల కేంద్రంలోని గౌడ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలుడికి, మరొకటి ఖానాపురం మండలం బండమీది మామిడి తండాకు చెందిన బాలికకు సంబంధించినవిగా గుర్తించారు. మొత్తం 12 నమూనాలు పరీక్షించిన ప్రాంతాల్లోనే ఈ రెండు కేసులు వెలుగుచూడగా, మిగిలిన 23 నమూనాల్లో ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. నల్లబెల్లిలో బాలుడికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. డెంగ్యూ వ్యాప్తి నివారణకు ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యలను తప్పనిసరిగా పాటించాలని వైద్య నిపుణులు సూచించారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ వైద్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

# 16న ములుగు జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- పంచాయతీరాజ్ హామ్ రోడ్ల పనులకు ములుగు నుంచే శ్రీకారం
- అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం




**ప్రజానావ, ములుగు:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పంచాయతీరాజ్ హామ్ రోడ్ల పనులకు ములుగు నుంచే ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని వెల్లడించారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లాలో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనాతో కలిసి అన్ని శాఖల అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి హైదరాబాద్ నుంచి నేరుగా మేడారం చేరుకుని వనదేవతలను దర్శించుకున్న అనంతరం ములుగు చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారని తెలిపారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇందిరమ్మ మహిళా శక్తి భవనాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించడంతో పాటు నూతన కలెక్టరేట్ సముదాయ భవనాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లాలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న అభివృద్ధి పనుల వివరాలను అన్ని శాఖల అధికారులు ఈ నెల 10వ తేదీలోపు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఈ నెల 12న విడుదల చేస్తామని తెలిపారు. పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని ఆదేశించారు. మేడారం పరిసర ప్రాంతాల్లో రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై జరిమానాలు విధించడంతో పాటు ముందస్తుగా ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావే శంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, డీఆర్వో రవికుమార్, ఎస్‌డీసీ ప్రతాప్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కుషిల్ వంశీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరపత్రం ఆవిష్కరణ

**ప్రజానావ, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం ఎదుట శుక్రవారం బిజెపి హటావో దేశ్ కు బచావో కరపత్రం ఆవిష్కరించారు. మానేరు పరిరక్షణ కమిటీ కన్వీనర్– గుంటి వేణు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మానేరు వద్దకు సిపిఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు. అధిక సంఖ్యలో మానేరు పరివాహక ప్రాంత రైతులు ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కో– కన్వీనర్లు చెన్నమనేని పురుషోత్తం రావు, భూస వేణు. మార్వాడి సుదర్శన్ నాయకులు దోసల చంద్రం ఇబాదుల్లా ఖాన్ ఎర్ర మల్లయ్య, దోసల వెంకటేష్, నాందేడ్ మనోజ్ కుమార్, బరిగెల బిక్షపతిలు పాల్గొన్నారు.



కార్మిక క్షేత్రం గణేష్ నగర్‌లో..

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల కార్మిక క్షేత్రంలోని గణేష్ నగర్ అంగన్వాడి సెంటర్లో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం సఖి క్లస్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసము, తల్లిపాల గురించి అవగాహన ఐసిడిఎస్ సిడిపిఓ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ డా. సాహితి ముర్రుపాల గురించి తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు లింగంపల్లి గంగరాజు, ఎలుక వెంకటేశం చిన్నారులను అంగన్వాడి కేంద్రానికి ప్రతిరోజు పంపించాలని చెప్పారు. సిడిపిఓ సబిత, ఏసీడిపిఓ ఉమా రాణిలు మాట్లాడుతూ ముర్రుపాలు చిన్నారులకు మొదటి టీకా అని చెప్పారు .ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న, హెల్త్ సూపర్వైజర్ వాణి, ఏఎన్ఎమ్ లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గర్భవతులు బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటకలో బంగారం – రాగి అన్వేషణకు సింగరేణి శ్రీకారం

- దేవదుర్గ బ్లాక్ అన్వేషణకు కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖతో ఒప్పందం
- ఐదేళ్లలో అన్వేషణ పూర్తి చేస్తాం: డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు



**ప్రజానావ, హైదరాబాద్ :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, యాదగిరి జిల్లాల్లో విస్తరించి ఉన్న దేవదుర్గ బ్లాక్‌లో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ దిశగా మరో కీలక ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వ వేలంలో అన్వేషణ లైసెన్స్ పొందిన నేపథ్యంలో, అన్వేషణ పనులను ప్రారంభించేందుకు కర్ణాటక రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖతో గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. బెంగళూరులోని కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కర్ణాటక డీఎంజీ డైరెక్టర్ రంగప్ప, సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందం ప్రకారం, సింగరేణికి కేటాయించిన 199.13 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని దేవదుర్గ బ్లాక్‌లో ఐదేళ్లలో ఖనిజ అన్వేషణను పూర్తి చేయనున్నారు.ఈ సందర్భంగా డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ &ఏఎంపీ; ప్లానింగ్) వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు అవసరమైన అన్ని అనుమతులు పూర్తయ్యాయని, ఇప్పుడు క్షేత్రస్థాయిలో అన్వేషణ ప్రారంభించేందుకు ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఇప్పటికే అవసరమైన అధికారులను నియమించామని, త్వరలో మిగిలిన సిబ్బందిని కూడా నియమించి రెండేళ్లలోపు జీ–4 దశ అన్వేషణను విజయవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇతర రాష్ట్రంలో ఈ స్థాయిలో ఖనిజ అన్వేషణ చేపట్టడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారని పేర్కొన్న ఆయన, 130 ఏళ్లకు పైగా అన్వేషణ అనుభవం కలిగిన సంస్థగా ఈ ప్రాజెక్టును కూడా విజయవంతంగా పూర్తి చేస్తామనే విశ్వాసం వ్యక్తం చేశారు. సహకరించిన కర్ణాటక ప్రభుత్వం, మైన్స్ అండ్ జియాలజీ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.అన్వేషణలో భాగంగా రిమోట్ సెన్సింగ్, జియోలాజికల్ మ్యాపింగ్, జియోఫిజికల్ సర్వేలు నిర్వహించి, ఎంపిక చేసిన ప్రాంతాల్లో స్కౌట్ డ్రిల్లింగ్ చేపడతారు. అనంతరం సేకరించిన నమూనాలపై పెట్రోగ్రాఫిక్, మినరలాజికల్ అధ్యయనాలతో పాటు సమగ్ర మూలకాల విశ్లేషణ చేపట్టనున్నారు.ఈ విశ్లేషణలను కొత్తగూడెంలో ఇటీవల ఏర్పాటు చేసిన సింగరేణి జియోసైన్స్ ల్యాబొరేటరీలో నిర్వహిస్తారు. అనంతరం రూపొందించే సమగ్ర నివేదికను కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖకు సమర్పించనుండగా, ఆ నివేదిక ఆధారంగా తదుపరి విస్తృత స్థాయి అన్వేషణ చేపట్టే అవకాశం ఉంటుంది.ఈ కార్యక్రమంలో ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, డీజీఎం (జియాలజీ) వి. రాజేశ్వర్, డీవైఎఫ్ఎం లక్ష్మీ ప్రియ, సీనియర్ లా ఆఫీసర్ ప్రభందిత తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎంకు వినతి

- ఆర్టీసీ డిపో, కాళేశ్వరం 22వ ప్యాకేజీతో పాటు కీలక ప్రాజెక్టుల ప్రతిపాదనలు
- సానుకూలంగా పరిశీలిస్తామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు సీఎం హామీ



**ప్రజానావ, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పలు కీలక అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మదన్‌మోహన్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు 22వ ప్యాకేజీ పనులకు ఆమోదం తెలపడంతో పాటు ఎల్లారెడ్డి పట్టణంలో నూతన ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బాన్సువాడ–ఉప్పల్వాయి ప్రధాన రహదారిపై సర్వాపూర్– మొండిసడక్ మధ్య, గాంధారి–తిమ్మాపూర్ మధ్య రెండు హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ వంతెనలు నిర్మితమైతే వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గాంధారి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, లింగంపేట, సదాశివనగర్, రామారెడ్డి, గాంధారి మండలాల్లో శిథిలావస్థకు చేరిన తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల స్థానంలో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాం ప్లెక్స్ భవనాల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇచ్చి నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సమర్పించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా పరిశీలించినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పనులకు దశలవారీగా నిధులు విడుదల చేసి అమలు చేస్తా మని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా..

# వ్యాపారాలు లాభసాటిగా సాగాలి

మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా మైసమ్మ బోనాలు



**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో ఆషాఢ మాసం బోనాల పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన మైసమ్మ తల్లి బోనాల పండుగ లో ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, అతిథులుగా వైస్ చైర్మన్ దార్ల సందీప్,17 వ వార్డ్ కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ మాట్లాడుతూ మున్సిపల్ సేవలను ప్రజలకు అందించే మున్సిపల్ కార్యాలయ సిబ్బంది వర్క్ ఇన్స్పెక్టర్లు ఇన్స్పెక్టర్లు కలిసి సమాజ హితం కోరి నిర్వహిస్తున్న మైసమ్మ తల్లి బోనాల పండుగలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో తాము పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.ఆ మైసమ్మ తల్లి చల్లని చూపుతో అందరికీ ఉపాధి లభించి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ముఖ్యంగా మన సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగిస్తూ మైసమ్మ తల్లిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ వారిలోని ఐక్యతను తెలియజేసేలా ఈ మైసమ్మ తల్లి బోనాల పండుగను కన్నుల పండగ నిర్వహిస్తున్న వారందరు ఆయురారోగ్యాలను సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి, ఆ మైసమ్మ తల్లి చల్లని దీవెనలతో కార్మికులకు అండగా నిలవాలని ప్రార్థించారు. ఈ వేడుకలలో మున్సిపల్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని డబ్బు చప్పుల మధ్య మైసమ్మ తల్లి, పోచమ్మ తల్లి అమ్మ వార్లకు బోనాలు సమర్పిస్తూ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.

# వెల్ది హరిప్రసాద్ నైపుణ్యం స్ఫూర్తిదాయకం

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఖ్యాతిని మరింత చాటాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికుడికి జిల్లా కలెక్టర్ సన్మానం



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్లకు చెందిన వెల్ది హరిప్రసాద్ చేనేత నైపుణ్యం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్ లో వెల్ది హరిప్రసాద్ సూక్ష్మ మగ్గం, జీ 20 సదస్సు సందర్భంగా దాని ఉద్దేశాన్ని వివరిస్తూ.. అలాగే వివిధ దేశాల ప్రధాన మంత్రుల చిత్రాలతో వస్త్రం తయారీ, పీతాంబరం, అగ్గిపెట్టెలో పట్టే, ఉంగరం, దబ్బనంలో పట్టే చేనేత వస్త్రాలు తయారు చేసి విశేష ప్రతిభ చూపుతున్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన కార్ఖానకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం వెళ్లారు. హరిప్రసాద్ దంపతులకు పుష్ప గుచ్చం అందజేసి.. శాలువాతో సన్మానించారు. హరిప్రసాద్ మగ్గంపై పీతాంబరం, అగ్గిపెట్టెలో పట్టే చీరలను తయారు చేసి సిద్ధంగా పెట్టగా, జిల్లా కలెక్టర్ పరిశీలించి.. వాటి తయారీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో చీర తయారీకి ఎంత సమయం పడుతుంది? ముడి సరుకు, పెట్టు బడి తదితర అంశాలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వెల్ది హరిప్రసాద్ చేనేత రంగంలో నైపుణ్యం చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తన మగ్గంపై ఎంతో నైపుణ్యంతో చీరలు తయారు చేస్తున్నారని కొనియాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఖ్యాతిని ఇప్పటికే జాతీయస్థాయిలో చాటారని గుర్తు చేశారు. మరిన్ని నూతన ఆవిష్కరణలు చేసి.. సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటాలని ఆకాంక్షించారు. చీరలకు మంచి ప్యాకింగ్ రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్, తహసీల్దార్ మహేష్ కుమార్ ఉన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నల్ల బ్యాడ్జీలతో నిరసన

**ప్రజానావ, జమ్మికుంట:** ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్ డీఏ బకాయిల విడుదల, పీఆర్సీ ప్రకటన, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణతో పాటు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు, పదోన్నతుల జీవో అమలులోకి తేవాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాజధాని ముట్టడికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# రాజ్‌నంద్‌గావ్‌లో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్

- రూ.3వేల కోట్లకు పైగా పెట్టుబడులు.. 9వేల ఉద్యోగాలు
- 306 ఎకరాల్లో 'ఈఎంసీ 2.0'
- రూ.210.56 కోట్ల కేంద్రం ఆర్థిక సాయం



**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ (ఈఎంసీ 2.0) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ క్లస్టర్ ద్వారా రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించడంతోపాటు ప్రత్యక్ష, పరోక్షంగా దాదాపు 9 వేల ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని అధికారులు శుక్రవారం తెలిపారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (మైటీ) ఈ ప్రాజెక్టుకు రూ.210.56 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.432.08 కోట్లుగా ఉంది. ఛత్తీస్‌గఢ్ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సీఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో దాదాపు 306 ఎకరాల్లో క్లస్టర్‌ను అభివృద్ధి చేయనున్నారు.

## ఆధునిక పారిశ్రామిక వసతులు

క్లస్టర్‌లో సిద్ధంగా ఉన్న ఫ్యాక్టరీ స్థలాలు, నిరంతర విద్యుత్, నీటి సరఫరా, గోదాములు, ఇతర ఆధునిక పారిశ్రామిక మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నారు. దీంతో కంపెనీలు తక్కువ వ్యవధిలోనే తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు వీలు కలుగుతుంది. సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ రంగాలకు చెందిన నాలుగు యాంకర్ కంపెనీలు ఇప్పటికే క్లస్టర్‌లో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆసక్తి వ్యక్తం చేశాయి. ఇది టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు ఛత్తీస్‌గఢ్ ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుతున్నదనడానికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.

## 'మేకిన్ ఇండియా'కు ఊతం

క్లస్టర్ ఏర్పాటుతో ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యం, విడిభాగాల ఉత్పత్తి, దేశీయ విలువ జోడింపు పెరుగుతాయని అధికారులు తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి జాతీయ కార్యక్రమాలకు ఈ ప్రాజెక్టు మరింత ఊతమిస్తుందని పేర్కొన్నారు. క్లస్టర్‌కు ఆమోదం తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి కృతజ్ఞతలు తెలిపారు. భారీ ప్రాజెక్టు ద్వారా లభించే ఉద్యోగ అవకాశాలను రాష్ట్ర యువత సద్వినియోగం చేసుకునేలా పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలను వారికి అందిస్తామని సీఎం పేర్కొన్నారు.

# వివాదాస్పద ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు

ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ

**న్యూఢిల్లీ :** వివాదాస్పద ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా తమ పార్టీకి చెందిన ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ చేసింది. ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై ప్రభుత్వం చర్చ చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ కాంగ్రెస్ ఎంపీలు తప్పనిసరిగా హాజరు కావాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో తమ తమ సభల్లో తప్పనిసరిగా హాజరు కావాలని పార్లమెంటు సభ్యులను కోరింది. ఈ మేరకు రాజ్య సభలోని కాంగ్రెస్ చీఫ్ విప్ జైరావ్ రమేశ్ విప్ జారీ చేశారు. ఈ సందర్భంగా 2026 ఆగస్టు 10, 11, 12 తేదీల్లో రాజ్యసభలో చాలా ముఖ్యమైన అం శాలను చర్చకు తీసుకోనున్నట్లు జైరావ్ రమేశ్ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు తప్పనిసరిగా సభలో సభ్యులు ఉండాలని, పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అత్యంత ముఖ్యమైన దిగా పరిగణించాలని కోరారు. మరో వైపు, లోక్‌సభ లోని కాంగ్రెస్ సభ్యుల పార్టీ ఇదే విధమైన విప్ జారీ చేసింది. ఆ మూడు రోజుల పాటు కాంగ్రెస్ ఎంపీలం తా తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొం ది. అదేవి ధంగా ఇండియా కూటమిలోని అన్ని మిత్రపక్షాలకు ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయా పార్టీల ఎంపీలం దరూ హాజరు కావాలని కోరింది. కాగా, ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు, నియోజ కవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

## లోక్‌భవన్ 'ఎట్ హోమ్'కు

# పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజానావ, హైదరాబాద్:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఎట్ హోమ్' కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం లోక్‌భవన్ లో పోలీసు, సాధారణ పరిపాలన, ప్రోటోకాల్, సమాచార, పౌర సంబంధాల శాఖ, దూరదర్శన్, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్, ఉద్యానవన తదితర శాఖల ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన మినిట్–టు–మినిట్ కార్యాచరణ, సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. భద్రత, ట్రాఫిక్, బందోబస్తు, వీఐపీ రాకపోకలు, పార్కింగ్, ప్రత్యక్ష ప్రసారం, పారిశుద్ధ్యం, దోమల నివారణ, పూల అలంకరణ, నిరంతర విద్యుత్ సరఫరా, అగ్నిమాపక భద్రత, క్యాటరింగ్, ఆహార నాణ్యత తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దానకిశోర్ స్పష్టం చేశారు. సమావేశంలో ప్రోటోకాల్ డైరెక్టర్ సి.హెచ్. లింగయ్య, నగర జాయింట్ పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి, ఏడీసీ క్రాంతిలాల్, ఐఅండ్‌పీఆర్ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధాకిషన్, డీసీపీ శిల్పవల్లి, డిప్యూటీ సెక్రటరీ జి. పల్లవి తదితరులు పాల్గొన్నారు.





# ప్రజాస్వామ్యానికి పట్టిన చీడను వదిలించాలి!

EDITORIAL

ఇటీవల పరీక్ష పేపర్ల లీజీ పాలకులు నిర్లక్ష్య ధోరణికి అద్దం పట్టింది. ఈ క్రమంలో బొద్దింకల దండు ఢిల్లీపై దండయాత్ర చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, పేపర్ లెస్ పరీక్షల కోసం నందన్ నీలుకని నేతృత్వంలో కమిటీ వేయడం వంటిన్నీ చకచకా జరిగిపోయాయి. ఇదంతా వలం విద్యార్థుల ఒత్తిడి మూలంగానే జరిగిందని చెప్పాలి. ఈ ఒత్తిడిని కొనసాగించాలని, దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే చేసిన ప్రకటన ప్రజాస్వామ్య వ్యవస్థ గట్టిగా నిలబడడానికి తోడ్పడుతంది.

ప్రజాస్వామ్యంలో పాలకులు నియంతులగా మారుతుంటే ప్రెజర్ గ్రూప్ ఉండాల్సిందే. ప్రతిపక్షాల మాట కూడా వినకుండా పాలన చేయడం అలవాటు చేసుకున్నారు. తాము అన్నకున్న విధానంలో పాలన సాగుతోంది తప్ప, ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా సాగడం లేదు. ఇటీవల పరీక్ష పేపర్ల లీజీ పాలకులు నిర్లక్ష్య ధోరణికి అద్దం పట్టింది. ఈ క్రమంలో బొద్దింకల దండు ఢిల్లీపై దండయాత్ర చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, పేపర్ లెస్ పరీక్షల కోసం నందన్ నీలుకని నేతృత్వంలో కమిటీ వేయడం వంటిన్నీ చకచకా జరిగిపోయాయి. ఇదంతా వలం విద్యార్థుల ఒత్తిడి మూలంగానే జరిగిందని చెప్పాలి. ఈ ఒత్తిడిని కొనసాగించాలని, దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే చేసిన ప్రకటన ప్రజాస్వామ్య వ్యవస్థ గట్టిగా నిలబడడానికి తోడ్పడుతంది. అయితే ఈ పోరాటంలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత డా బొద్దింకల పార్టీదే. ఇకపోతు ఈ ఒత్తిడి కొనసాగించేలా దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' .. అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని దీప్కే తెలిపారు. నిజంగా ఈ ఆలోచనను స్వాగతించాల్సిందే. ప్రతి ఒక్కరూ ఈ నినాదం వెనక నిలబడాలి. ఎందుకంటే పాలకులు గతి తప్పకుండా ఉండాలంటే ఏదో ఒకచోట చెక్ పడాల్సి ఉంది. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ చేసిన ఈ కీలక ప్రకటన ప్రజలను ఆలోచింప చేసేదిగా ఉంది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించినందున ప్రజలు డా ఈ ఉద్యమాన్ని సొంతం చేసుకోవాలి. మద్దతుగా నిలవాలి.. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం సిజెపి చేసింది. సెప్టెంబర్ నుంచి దేశ వ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని దీప్కే తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. అంటే ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరపున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని డా దీప్కే స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని డా పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతేనే ఉంటాయి. కాబట్టి పోరాటం చేయాలన్న దీప్కే సంకల్పం అభినందనీయం. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్యగా మారింది. దీనిపై పాలకపక్షాలు కప్పదాటు ప్రకటనలు చేస్తున్నాయి. దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. దేశంలో నాణ్యమైన విద్య రోజురోజు భారంగా మారుతోంది. వపిసరీతమైన ఫీజుల దోపిడీ సాగుతోంది. అయినా పాలకులు దృష్టి సారించడం లేదు. ఈ రంగంపై పోరా డాలన్న సంకల్పం మంచిదే. ఈ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని వూడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతి ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయింది. అన్నింటికి మించి జెన్–జీ యువత చేస్తున్న ఉద్యమాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్వాగతించడం విశేషం. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైనవేనని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. నేటి జెన్–జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ నిర్మొహమాటంగా చెప్పారు. మొత్తంగా ప్రతి ఒక్కరూ యువత ఆలోచనలను స్వాగతిస్తున్నారు. పాలకులు డా కళ్లు తెరిస్తే మంచిది.

ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. నేటి జెన్–జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ నిర్మొహమాటంగా చెప్పారు. మొత్తంగా ప్రతి ఒక్కరూ యువత ఆలోచనలను స్వాగతిస్తున్నారు.



# చేనేత అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం

**జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి**

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** చేనేత కార్మికుల సంక్షేమం, అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నేతన్నల జీవనోపాధి మెరుగుపడేలా అన్ని విధాలా అండగా నిలుస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా భువనగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. చేనేత రంగానికి విశిష్ట సేవలందించిన పద్మశ్రీ గ్రహీత చింతకింది మల్లేశం సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం అర్హులైన చేనేత కార్మికులకు రుణమాఫీ భరోసా చెక్కులు పంపిణీ చేయడంతో పాటు విశిష్ట ప్రతిభ కనబరిచిన నేతన్నలను అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల, పద్మశ్రీ గ్రహీత చింతకింది మల్లేశం, చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీరేఖ, యునైటెడ్ వే హైదరాబాద్ సీఈఓ రేఖా శ్రీనివాసన్, పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు లవకుమార్, భువనగిరి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఏలే సుధాకర్‌తో పాటు నేతన్నలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తాం

- రూ.7 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీకారం
- ఆగస్టు 15 నుంచి కొత్త ఆసరా పింఛన్లు, పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల అమలు



**ప్రజానావ, ఖమ్మం/తిరుమలాయపాలెం:** కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి సుమారు రూ.7 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, అనంతరం నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడారు. తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసి తండా వరకు రూ.2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు రూ.4.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. హైదర్‌సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో రూ.20 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. హైదర్‌సాయిపేటలో పంచాయతీ భవన నిర్మాణానికి స్వచ్ఛందంగా స్థలం ఇచ్చిన గ్రామస్థుడు శ్రీనుకు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా తిప్పారెడ్డిగూడెంకు రూ.35.55 కోట్లు, హైదర్‌సాయిపేటకు రూ.37 కోట్లు, పాతర్లపాడుకు రూ.29.25 కోట్లు, రాజారాం గ్రామానికి రూ.8.48 కోట్లను వివిధ అభివృద్ధి పనుల కోసం కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, మొదటి దశలో 4.5 లక్షలు, రెండో దశలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు లక్ష ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు. మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందిస్తామని, త్వరలోనే రెండో విడత ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని చెప్పారు. ప్రతి సోమవారం నిర్మాణ పనులను సమీక్షించి, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లోనే బిల్లుల మొత్తాన్ని జమ చేస్తామని, ఇళ్ల కోసం ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వచ్చే ఆగస్టు 15 నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో కొనసాగుతున్నాయని పేర్కొన్న మంత్రి, సన్నరకం వరికి కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని తెలిపారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గురుకులాల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డీపీవో వినోద్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ మున్సిపాలిటీగా ఏదులాపురం

- ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు
- ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ
- మార్నింగ్ వాక్ నిర్వహించి అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి




**ప్రజానావ, ఖమ్మం/ఏదులాపురం:** ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. శుక్రవారం ఉదయం మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, సత్యనారాయణపురం, ఇందిరమ్మ కాలనీలలో కాలినడకన పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పరిస్థితులు, ప్రజా మౌలిక వసతులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఏర్పాటైన ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ప్రాధాన్య క్రమంలో పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో తుమ్మ చెట్లు పెరగడం, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడం వంటి సమస్యలను గుర్తించామని, వాటి శాశ్వత పరిష్కారానికి అవసరమైన డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని ప్రజలు తెలిపారని, దానిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. విద్యుత్ తీగలకు సంబంధించిన సమస్యలను కూడా సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం వచ్చిన వినతులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పార్కుల అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అభివృద్ధి పనులను అధికారులు నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో భాగంగా సాయిగణేష్ నగర్‌లోని ఓ టీ స్టాల్‌లో టీ తాగిన మంత్రి, అనంతరం వర్షంలో గొడుగు పట్టుకుని ఇందిరమ్మ కాలనీలో కాలినడకన తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. కాలనీవాసులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# కొమరం భీమ్ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

- 'చలో కొత్తగూడెం'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చుంచు రామకృష్ణ విజ్ఞప్తి

**ప్రజానావ, చర్ల:** ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీమ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పే బాధ్యత ప్రతి ఆదివాసీపై ఉందని తొమ్మిది ఆదివాసీ తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ అన్నారు. చర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న కొమరం భీమ్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి గర్వకారణమని, ఈ విగ్రహం ఆదివాసీ పోరాట చరిత్రకు చిరస్మరణీయ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొమరం భీమ్ చేసిన త్యాగాలు, పోరాటాలను ఆదివాసీ యువత, ఉద్యోగులు, ప్రజలు ఎప్పటికీ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆదివాసీల హక్కులు, సమస్యల సాధన కోసం నిర్వహిస్తున్న 'చలో కొత్తగూడెం' కార్యక్రమానికి ఆదివాసీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని, ఐక్యంగా తమ గొంతును వినిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ సీనియర్ నాయకులు ఇర్ప వసంత్, ఇర్ప ప్రకాష్, కారం నరేష్, సోడి అనిల్‌కుమార్, కోరం బిట్టు, కోరం సూర్యనారాయణ, ఇర్ప అరుణ్‌కుమార్, కోరం వేణుతో పాటు పలువురు ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



# చేనేతను కాపాడాలంటే కార్పొరేట్ పెత్తనానికి అడ్డుకట్ట వేయాలి

- ముడిసరుకులపై జీఎస్టీ మినహాయింపు కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది: తూంకుంట అంక్షారెడ్డి

**ప్రజానావ, గజ్వేల్:** కార్పొరేట్ సంస్థల పెత్తనం కారణంగా చేనేత కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందని, వారి ఉపాధిని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చేనేత రంగానికి అవసరమైన ముడిసరుకులపై జీఎస్టీ మినహాయింపు కల్పించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని మగ్గం చౌరస్తాలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో చేనేత కార్మికులకు ఉపాధి కష్టంగా మారిందని, వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రంగాన్ని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పండుగల సందర్భంగా మహిళలకు పంపిణీ చేసే చీరలను నేరుగా చేనేత కార్మికుల నుంచి కొనుగోలు చేస్తూ వారికి ఆర్థికంగా చేయూతనందిస్తోందని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా పెన్షన్లు, రాయితీలు అందించడంతో పాటు చేనేత కార్మికులకు ప్రోత్సాహక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఏడాది చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించి, పాత విద్యుత్ బకాయిలను కూడా ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. ప్రజలు కూడా చేనేత వస్త్రాలనే కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు రాజేశం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతిన్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు షరీఫ్, పద్మశాలి యువజన జిల్లా విభాగం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, నేతలు ఉదేం సారిక శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, గాడిపల్లి శ్రీనివాస్, రమేష్ గౌడ్, జగ్గయ్యగారి శేఖర్, రాములు గౌడ్, సమీర్, సురేష్‌తో పాటు పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# ప్రతి వార్డులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు

- ఆగస్టు 10 నుంచి 14 వరకు మొబైల్ స్క్రీనింగ్ వాహనం ద్వారా పరీక్షలు
- మహిళలు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి: హరీశ్‌రావు



**ప్రజానావ, సిద్దిపేట:** మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ సిద్దిపేట పట్టణంలోని ప్రతి వార్డులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సింధూ ఆస్పత్రి సహకారంతో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం ద్వారా మహిళలకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్సతో పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందని, మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు, ముందస్తు పరీక్షల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు హరీశ్‌రావు తెలిపారు. మొబైల్ స్క్రీనింగ్ వాహనం ప్రతి రోజు నిర్ణీత వార్డుకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన కేంద్రంలో నమోదు అనంతరం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ పరీక్షల ద్వారా ఆరోగ్య పరిస్థితిని ప్రారంభ దశలోనే అంచనా వేసే అవకాశం ఉంటుందని, అవసరమైతే తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సకు సంబంధించిన సూచనలను కూడా వైద్య నిపుణులు అందిస్తారని పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కుటుంబ ఆరోగ్య పరిరక్షణలో మహిళల పాత్ర కీలకమని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు. ఆగస్టు 10న ఉదయం 9 గంటల నుంచి సుభాష్‌నగర్‌లోని పోప భవనంలో, ఆగస్టు 11న నాసర్‌పూర్ మహిళా భవన్‌లో, ఆగస్టు 12న లింగారెడ్డిపల్లిలోని లక్ష్మీ నరసింహ మినీ ఫంక్షన్ హాల్‌లో, ఆగస్టు 13న హనుమాన్‌నగర్‌లోని మెదరి సంఘం భవనంలో, ఆగస్టు 14న అంబేద్కర్‌నగర్‌లోని పట్కర్ సంఘం భవనంలో ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత వార్డుల మహిళలు నిర్ణీత తేదీల్లో స్క్రీనింగ్ కేంద్రాలకు చేరుకుని నమోదు చేసుకుని ఉచిత పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమం మహిళల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించేందుకు దోహదపడుతుందని వైద్య నిపుణులు పేర్కొన్నారు.

# 100 రోజుల హామీ ఏమైంది?

- ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి
- ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేస్తామన్న హామీ అమలెక్కడ?
- ఎన్నికల హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి డిమాండ్



**ప్రజానావ, ఆలేరు:** ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రజలకు సమాధానం చెప్పాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆలేరులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టేలా మాట్లాడడం సరికాదన్నారు. 100 రోజుల్లో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని చెప్పిన హామీ ఇప్పటివరకు ఎందుకు అమలు కాలేద ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలేరు నియోజకవర్గం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని, రోడ్లు, సాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతుల రంగాల్లో చేపట్టిన పనులను ప్రజలు మరచిపోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ముఖ్యంగా ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, మున్సిపల్ కౌన్సిలర్లు బీధని కళ్యాణి మధు, పాకాల మోనిక హరీష్, టంగుటూరు సర్పంచ్ జుకంటి అనిల్, కొలనుపాక సర్పంచ్ బేధరబోయిన యకమ్మ, నాయకులు జల్లి నర్సింహులు, బింగి రవి, పంతం కృష్ణ, కుండే సంపత్, వెంకటేష్, పరిదే సంపత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



## హై లెవెల్ బ్రిడ్జి పనుల జాప్యంపై నిరసన

ప్రజానావ, గంభీరావుపేట: గంభీరావుపేట మండలం లింగన్న పేట హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల జాప్యంపై బిజెపి నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మండల బిజెపి అధ్యక్షుడు కోడె రమేష్ అధ్యక్షతన నాయకులు వాగులో నిలబడి ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణపు పనులు వేగవంతం చేసి ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ హై లెవెల్ బ్రిడ్జి మంజూరి చేయగానే ర్యాలీలు పాలాభిషేకాలు నిర్వహించుకొని ఉన్న పాత బ్రిడ్జిని కూలగొట్టారని ఆరోపించారు. ప్రతి ఏటా వర్షాకాలంలో వాగు ఉప్పొంగి తాత్కాలికంగా రోడ్డు కొట్టుకపోయి ప్రాంత ప్రజలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంత ప్రజల ఓట్లతో గెలుపొందిన కేటీఆర్ ఏనాడు బ్రిడ్జి నిర్మాణం పనులు, ప్రజా సమస్యలపై సమీక్షించి పట్టించుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం పురోగతి సాధించకపోవడం విచారకరమన్నారు. తక్షణం బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నర్సింలు, కార్యదర్శులు రాజు, స్వామి, నాయకులు పత్తి స్వామి, బండ దేవయ్య, నాగరాజ్ గౌడ్, సర్వోత్తమ్, శ్రీనివాస్, దేవేందర్ యాదవ్ లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలి
- అదనపు కలెక్టర్లు బీ. వెంకటేశ్వర్లు, కిషోర్‌కుమార్




ప్రజానావ, నిర్మల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేడుకలకు ప్రోటోకాల్‌కు అనుగుణంగా అతిథులను ఆహ్వానించడంతో పాటు కార్యక్రమ వేదికను ఆకర్షణీయంగా ముస్తాబు చేయాలని సూచించారు. దేశభక్తి భావాలు ఉట్టిపడేలా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని, కార్యక్రమం ముగిసే వరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టెంట్‌లు, షామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచడంతో పాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలంటూ కేకే ఓసీ పనులకు అడ్డుకట్ట

- నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్
- స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించబోమని గ్రామస్తుల హెచ్చరిక



ప్రజానావ, బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని కేకే ఓసీ (కళ్యాణి ఖని ఓపెన్‌కాస్ట్)లో జరుగుతున్న పనులను దుబ్బగూడెం గ్రామస్తులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. నిర్వాసితులకు సింగరేణి యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. పునరావాస కాలనీ, రోడ్ల సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదని, తమను మోసం చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌తో పాటు స్థానిక రెవెన్యూ అధికారులను పలుమార్లు కలిసి వినతులు సమర్పించినా స్పందన లేదని ఆరోపించారు. 309 మంది నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ వాటికి పట్టా హక్కులు కల్పించలేదని, మరో 20 మంది నిర్వాసితులకు ఇప్పటికీ ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని మండిపడ్డారు. పునరావాస కాలనీలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు రహదారుల నిర్మాణం చేపట్టి ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ హామీల అమలుపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తమ ఆందోళనను విరమించబోమని గ్రామస్తులు ప్రకటించారు. కేకే ఓసీ ప్రాజెక్టు అధికారి రాంబాబు ఆందోళనకారులతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోయింది. సింగరేణి ఉన్నతాధికారులు అధికారికంగా హామీ ఇచ్చి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభించిన తర్వాతే ఆందోళన విరమిస్తామని దుబ్బగూడెం గ్రామస్తులు స్పష్టం చేశారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు భరోసా

• రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి • వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును మరింత విస్తరించవద్దు • ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కుటుంబాలకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ • గత ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు... ప్రస్తుతం 16 లక్షలకు పైగా కొత్త కార్డుల మంజూరు • మండల ప్రజావాణిని ప్రతి వారం తప్పనిసరిగా నిర్వహించి ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలి • వనమహోత్సవం, చేయూత పెన్షన్లు, యూనిఫాం కుట్టు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి • జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజానావ, పెద్దపల్లి : రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగును పెంచే



అవకాశం ఉందని, అలాంటి పరిస్థితి భవిష్యత్తులో రైతులకు నష్టాన్ని కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి రైతుకు స్పష్టమైన సందేశం చేరేలా వ్యవసాయ అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం సాగునీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మరో 15 రోజుల పాటు అన్ని ప్రధాన ప్రాజెక్టుల నీటి మట్టాలను సమీక్షించిన అనంతరం పరిస్థితులకు అనుగుణంగా సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోకి వస్తున్న నీటి ప్రవాహాలను బట్టి అందుబాటులో ఉన్న ప్రతి జల వనరును నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని నీటిపారుదల ప్రాజెక్టుల నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ జరగలేదని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్రంలోని 1.05 కోట్ల రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఆగస్టు 15వ తేదీ నుంచి తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణ ప్రణాళికను యథావిధిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను రైతులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 99,81,167 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 15 తర్వాత వర్షపాతం మరింత తగ్గే అవకాశమున్నందున ప్రతి జిల్లాలో సాగునీటి సలహా సమావేశాలు నిర్వహించి నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్ సరఫరాపైనా ప్రభావం ఉండే అవకాశమున్నందున నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వరి సాగును మరింత పెంచవద్దని స్పష్టం చేశారు. ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, కొత్త చేయూత పెన్షన్ల అర్హుల జాబితాను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి వచ్చే నెల నుంచి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి, పౌర సరఫరాల శాఖ అధికారి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి, నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నేతన్నలకు చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరా మహిళా శక్తి చీరలతో ఉపాధి
- ఈ ఏడాది 4.50 కోట్ల మీటర్లు, త్వరలో మరో కోటి 50 లక్షల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రాజన్న సిరిసిల్లలో జాతీయ చేనేత దినోత్సవం
- నేత పరిశ్రమ కార్మికులతో కలిసి ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ర్యాలీ నిర్వహణ




ప్రజానావ, సిరిసిల్ల : నేతన్నలకు చేతినిండా పని కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కోర్టు నుంచి పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం వరకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి.. ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులతో కలిసి భారీ ర్యాలీ తీశారు. పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిరిసిల్ల చేనేత, వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు.

### 6 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తులకు ఆర్డర్లు

సిరిసిల్లలోని నేతన్నలు, కార్మికులు, ఆసాములు, యజమానులకు సంవత్సరంలో సుమారు ఎనిమిది నెలల పాటు పని కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత సంవత్సరం 6 కోట్ల 70 లక్షలకు పైగా మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 4 కోట్ల 50 లక్షల మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. త్వరలో మరో కోటి 50 లక్షలకు పైగా మీటర్లకు ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు, ఇతర అవసరాలకు సంబంధించిన వస్త్రాల ఉత్పత్తి ద్వారా కూడా స్థానిక నేతన్నలకు పని కల్పిస్తున్నామన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన రూ.400 కోట్లకు పైగా బకాయిలలో రూ.350 కోట్లకు పైగా చెల్లించి నేతన్నలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన చీరల బిల్లుల్లో 80 శాతం చెల్లించామని, మిగిలిన 20 శాతం కూడా త్వరలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూదాన్ పోచంపల్లిలో వస్త్రాల బకాయిల చెల్లింపుపైనా ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. నేతన్నల సంక్షేమం కోసం త్రిఫ్ట్ పథకం ద్వారా కార్మికుల పొదుపునకు ప్రభుత్వం సమానంగా చేయూతనిస్తోందన్నారు. నేతన్నల బీమా పథకం ద్వారా ఇప్పటివరకు సిరిసిల్లలో 129 మందికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులకు రూ.25 కోట్ల మేర రుణమాఫీ చేయడంతో పాటు లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేసినట్లు పేర్కొన్నారు. పవర్‌లూమ్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 25 హెచ్‌పీ వరకు పవర్‌లూమ్‌లకు యూనిట్‌కు రూ.2 సబ్సిడీ అమలు చేయడం వల్ల మూతపడిన అనేక పవర్‌లూమ్‌లు తిరిగి ప్రారంభమయ్యాయని తెలిపారు. దీంతో యజమానులు, ఆసాములు, కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయని అన్నారు. చేనేతకు ప్రసిద్ధి చెందిన సిరిసిల్ల జిల్లాలో నేతన్నలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. రైతన్నలు, నేతన్నలు సహా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డీఓ శ్రీధర్ బాబు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనపై ఉద్యమించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర విజయవంతం చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

ప్రజానావ, పెద్దపల్లి : బిజెపి ప్రజా వ్యతిరేక పాలన పై ఉద్యమించాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 10 నుండి 13 వరకు పెద్దపెల్లి జిల్లాలో తలపెట్టిన ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము అవలంబిస్తున్న నయా ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా సంఘటితం కావాలని, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తిరోగమన విధానాలతో దేశ సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులు నిత్యము దిగజారుతున్నాయని, భారతదేశ చరిత్రలోనే అత్యంత ప్రజా వ్యతిరేక కార్పొరేట్ సామ్రాజ్యవాద అనుకూల మతతత్వ నిరంకుశ అవినీతి బాహ్యామైన పరిపాలనను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తుందని, ధరల పెరుగులను అరికట్టడంలో, ద్రవ్యోల్బణం నియంత్రణలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని, బిజెపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపుమేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నదనీ, అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో ఆగస్టు 10 న సుల్తానాబాద్ లో ప్రారంభం అయి 13న గోదావరిఖని లో ముగుస్తుందని అన్నారు. సెప్టెంబర్ 1 న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించే బద్లావు జరూరి, హై చలో ఢిల్లీ ర్యాలీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని ప్రతీ మండల కేంద్రం, ప్రతీ గ్రామం వరకు ఈ నెల 10 నుండి 13 వరకు ప్రజా చైతన్య ను విజయవంతం చేయాలని సిపిఐ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోసిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, జిల్లా సమితి సభ్యులు ఆరెపల్లి మానస్ కుమార్, పూసాలా రమేష్, లతో పాటు పెర్క శివ, కుక్క రవి, కల్లేపల్లి శంకర్, బొంకూరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌నినోతో ఆయిల్‌పామ్ మేలు

- సాగు వైపు దృష్టి సారించాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ఆయిల్‌పామ్ వంటి అధిక లాభసాటి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామంలో రైతు భాను పొలంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ మొక్కల నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, మొక్క నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని రైతులు కోరగా.. ఉపాధి హామీ బీవీజీ రామ్‌జీ పథకం కింద ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్వో సుధీర్ రెడ్డి, డీహెచ్ఎస్‌వో విజయ్ భాస్కర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## ప్రజావాణిపై విస్తృత అవగాహన కల్పించాలి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- జలాశయాలు,చెరువుల పరిస్థితులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ సమీక్ష సమావేశం




ప్రజానావ, సిరిసిల్ల : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రభుత్వ పని దినాల్లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలందరికీ తెలిసేలా క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ, జలాశయాలు, చెరువుల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయడం, చేయూత పెన్షన్లకు దరఖాస్తుల కోసం అవసరమైన ధ్రువపత్రాలు అర్హులైన వారికే జారీ చేయడం, వరదలు సంభవిస్తే చేపట్టాల్సిన అప్రమత్తతా చర్యలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలతో శుక్రవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, మండల స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులందరూ హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, వాటిని జాప్యం చేయకుండా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండితే ప్రజలను అనుమతించవద్దని స్పష్టం చేశారు. సమీక్షలో డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు శ్రీధర్ బాబు, కేఎస్ బీ కుమారి, సంబంధిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గణన పుస్తక పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

**జనగణన కార్యకలాపాల సంచాలకురాలు భారతి హోలికేరి**

ప్రజానావ, కామారెడ్డి: జిల్లా గణన పుస్తకం రూపకల్పనకు సంబంధించిన క్షేత్రస్థాయి పనులను పకడ్బందీగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జనగణన కార్యకలాపాల సంచాలకురాలు భారతి హోలికేరి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతి హోలికేరి మాట్లాడుతూ జిల్లా గణన పుస్తకం ప్రభుత్వ శాఖలు, ప్రణాళికా రూపకర్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ఇతర వినియోగదారులకు జిల్లా స్థాయి సమగ్ర సమాచారాన్ని అందించే విలువైన సమాచార గ్రంథమని తెలిపారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, విధానాల అమలు, పరిశోధనలు, పరిపాలనా అవసరాలకు ఇది కీలక ఆధారంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించనున్న జిల్లా గణన పుస్తకం క్షేత్రస్థాయి పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన అనంతరమే నమోదు చేయాలని ఆదేశించారు. సమాచార సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారం భవిష్యత్తులో ప్రభుత్వ శాఖలు, ప్రణాళికా సంస్థలు, పరిశోధకులు, విద్యార్థులకు విశ్వసనీయ సమాచార వనరుగా ఉపయోగపడుతుందని, అందువల్ల సమాచార నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, ఉప కలెక్టర్ రవితేజతో పాటు జిల్లా స్థాయి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జన్మహక్కు పౌరసత్వానికి ట్రంప్ బ్రేక్!

- అమెరికాలో పుట్టిన వారికి పౌరసత్వంపై కొత్త ఆంక్షలు
- బర్త్ టూరిజం లక్ష్యంగా ఉత్తర్వులు

**వాషింగ్టన్:** అమెరికాలో జన్మించిన వారికి లభించే జన్మహక్కు పౌరసత్వం (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) పరిధిని కుదించే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక చర్యలు చేపట్టారు. 'బర్త్ టూరిజం'ను అడ్డుకోవడంతో పాటు కొన్ని వర్గాల పిల్లలకు పౌరసత్వ అర్హత ఉండదంటూ గురువారం రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. అమెరికాలో పర్యాటకులుగా ప్రవేశించి అక్కడ పిల్లలకు జన్మనిచ్చే విధానాన్ని వాణిజ్యపరంగా ప్రోత్సహించే వారిపై తాజా ఉత్తర్వుల్లో ఆంక్షలు విధించారు. విదేశీ ప్రభుత్వాల తరఫున లాబీయింగ్ చేసే వారి పిల్లలు, ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న తల్లిదండ్రుల పిల్లలు తదితర వర్గాలను కూడా పౌరసత్వ పత్రాలకు అనర్హులుగా పేర్కొన్నారు.

### సుప్రీంకోర్టు తీర్పు తర్వాత..

జన్మహక్కు పౌరసత్వాన్ని ముగించేందుకు ట్రంప్ గతంలో జారీ చేసిన ఉత్తర్వును జూన్ 30న అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. అమెరికాలో జన్మించిన దాదాపు ప్రతి వ్యక్తికి పౌరసత్వం లభిస్తుందనే శతాబ్దకాల అవగాహనను కోర్టు సమర్థించింది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు గత నిర్ణయంలోని లోపాలను సరిదిద్దేందుకు తీసుకున్న చర్యలని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ తాజా ఉత్తర్వులు అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణకు విరుద్ధమని వలస నిపుణులు, అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ (ఏసీఎల్‌యూ) విమర్శించాయి.





# యూరప్‌లో భానుడి భగభగలు

- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- ఇటలీలోని 27 నగరాల్లో రెడ్ అలర్ట్
- స్లోవేకియాలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత
- పలు దేశాల్లో కరవు, కార్చిచ్చులు
- రవాణా, విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు

**రోమ్:** యూరప్‌ను తీవ్ర వడగాల్పులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పలు దేశాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇటలీలోని 27 ప్రధాన నగరాల్లో గురువారం తొలిసారిగా ఒకేసారి అత్యున్నత స్థాయి రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఆస్ట్రియాలో 41.2 డిగ్రీలతో జాతీయ ఉష్ణోగ్రత రికార్డు నమోదవగా.. స్లోవేకియాలో ఏకంగా 42.2 డిగ్రీలు నమోదైంది. ఫ్రాన్స్‌లో కార్చిచ్చులు చెలరేగగా, పలు దేశాల్లో విద్యుత్ ఉత్పత్తి, రవాణా వ్యవస్థలపై ప్రభావం పడింది. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారితో పాటు మొత్తం జనాభాకు ఆరోగ్య ముప్పు ఉందని ఇటలీ అధికారులు హెచ్చరించారు. అత్యంత వేడి సమయాల్లో బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండాలని, తగినంత నీరు తాగాలని సూచించారు. రోమ్‌లోని కొలొస్సియం, పాంథియాన్ వంటి పర్యాటక ప్రాంతాల సందర్శన సమయాలను పొడిగించడంతోపాటు చల్లటి నీటి సదుపాయాలు, వైద్య సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### పడిపోతున్న నీటిమట్టాలు

స్లోవేకియాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైన నేపథ్యంలో డాన్యూబ్ నదిలో నీటిమట్టాలు భారీగా పడిపోయాయి. దీంతో గాబ్చికోవో జలవిద్యుత్ కేంద్రంలోని ఎనిమిది టర్బైన్లలో ఏడు నిలిచిపోయాయి. నీటి కొరతతో విద్యుత్ ఉత్పత్తి గతేడాదితో పోలిస్తే 15 శాతం తగ్గింది. ఆస్ట్రియాలోనూ తక్కువ వర్షపాతం నమోదైంది. హంగేరిలో డాన్యూబ్ నీటిమట్టం రికార్డు స్థాయిలో తగ్గడంతో దేశంలోని ఏకైక అణువిద్యుత్ కేంద్రం ఉత్పత్తిని సాధారణ స్థాయిలో కేవలం 10 శాతానికి పరిమితం చేసింది. సాయంత్రం వేళల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రభుత్వం ప్రజలు, పరిశ్రమలను కోరింది. జర్మనీలోనూ రైన్ సహా పలు నదుల్లో నీటిమట్టాలు తగ్గడంతో జల రవాణా, పరిశ్రమలపై ఆందోళన వ్యక్తమవుతోంది.

### ఫ్రాన్స్‌లో కార్చిచ్చుల ముప్పు

దక్షిణ ఫ్రాన్స్‌లోని వార్ ప్రాంతంలో కార్చిచ్చు అదుపులోకి వచ్చినప్పటికీ మళ్లీ చెలరేగే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. జూలై 20 నుంచి 60 చదరపు కిలోమీటర్లకు పైగా ప్రాంతం దగ్ధమైంది. బాల్కన్ దేశాల్లోనూ 40 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రతలతో కరవు, కార్చిచ్చులు ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా ఇలాంటి తీవ్ర వడగాలులు భవిష్యత్తులో మరింత తరచుగా, తీవ్రంగా సంభవించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# జెన్ జీని దేశద్రోహులుగా చూడొద్దు

- ప్రభుత్వంపై నిరసన దేశ వ్యతిరేకత కాదు
- విద్యార్థులపై కేసులు, వేధింపులు ఆపాలి
- మోహన్ భగవత్ వ్యాఖ్యలను సమర్థించిన జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా



**జమ్మూ:** జెన్ జీ యువత చేపడుతున్న ఆందోళనలు నిజమైనవేనని, ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టినంత మాత్రాన వారిని దేశ వ్యతిరేకులుగా చూడరాదన్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలను జమ్మూ–కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సమర్థించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, దేశాన్ని వ్యతిరేకించడం రెండూ ఒకటి కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం ద్వారా తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### భగవత్ వ్యాఖ్యలు ప్రోత్సాహకరం

ముంబైలో జరిగిన ఐఐఎంయూఎన్ 15వ వార్షికోత్సవంలో సుమారు 2,000 మంది జెన్–జీ, జెన్–ఆల్ఫా సభ్యులను ఉద్దేశించి భగవత్ మాట్లాడారు. యువత ఆందోళన చేస్తే వారిని దేశ వ్యతిరేకులుగా చూడకుండా వారితో చర్చలు జరిపి సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు సానుకూల పరిణామమని ఒమర్ పేర్కొన్నారు. నీట్ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసులు దాడులు చేయడం, క్రిమినల్ కేసులు నమోదు చేయడం, సామాజిక మాధ్యమాల ద్వారా వేధించడం వంటి చర్యలను నిలిపివేయాలని ఒమర్ కోరారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థుల బంధువులను సైతం పోలీసులు పిలిపిస్తున్నారని పేర్కొంటూ.. ఇలాంటి చర్యలను వెంటనే ఆపాలని అన్నారు. జార్ఖండ్‌లోనూ నియామక పరీక్షలపై ఆందోళన చేస్తున్న విద్యార్థులతో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చర్చలు జరపాలని ఒమర్ సూచించారు.

### పీఓకే పరిస్థితిపై ఆందోళన

పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్‌లో పౌరుల మరణాలపై వచ్చిన వార్తలపైనా ఒమర్ స్పందించారు. అక్కడి పరిస్థితిపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. అంతర్జాతీయ సమాజం దృష్టి రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ ఉద్రిక్తతలపై ఉన్నప్పటికీ పీఓకే ప్రజల పరిస్థితిపై తమకు ఆందోళన ఉందని పేర్కొన్నారు.

## జెన్ జెడ్ దేశానికి బలం

### మోహన్ భగవత్ వ్యాఖ్యలకు ఎంపీ కంగనా మద్దతు



**న్యూఢిల్లీ:** జెన్ జెడ్ దేశానికి బలమని, భారత సంస్కృతి, అస్తిత్వానికి యువత రాయబారులుగా ఎదుగుతున్నారని బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే యువతను దేశద్రోహులుగా చూడకూడదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను ఆమె సమర్థించారు. పార్లమెంట్ వెలుపల కంగనా మాట్లాడుతూ.. "జెన్ జెడ్ మన దేశానికి గొప్ప ఆస్తి. యువత మన సంస్కృతి, గుర్తింపుతో అనుసంధానమవుతున్నందుకు సంతోషంగా ఉంది" అన్నారు. కొద్దిమంది చేసే అసభ్య వ్యాఖ్యల వల్ల మొత్తం జెన్ జెడ్‌కు చెడ్డపేరు వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర నియామక పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులను రాహుల్ గాంధీ కలవకపోవడాన్ని కంగనా విమర్శించారు. కాగా, ఇటీవల జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల సందర్భంగా జెన్ జెడ్‌ను 'జనరేషన్ గట్టర్'గా విమర్శించిన కంగనా.. తాజాగా వారిని దేశ బలంగా అభివర్ణించడం చర్చనీయాంశంగా మారింది.

# మహిళల స్వేచ్ఛే దేశ ప్రగతికి చోదకశక్తి

- వారి గొంతు వినిపించకపోతే దేశం కుంటుపడుతుంది
- పితృస్వామ్య నియంత్రణ నుంచి విముక్తి అవసరం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయలేని దేశం విజయవంతం కాలేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మహిళల శక్తి, సామర్థ్యం పూర్తిస్థాయిలో వెలుగులోకి రాకపోతే దేశ ప్రగతి కుంటుపడుతుందని పేర్కొన్నారు. మహిళలను సామాజిక చర్చల్లో కీలక భాగస్వాములుగా మార్చడంతోపాటు వారు కోరుకున్న విధంగా జీవించే స్వేచ్ఛ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భారత మహిళల శక్తి, ఆలోచనా సామర్థ్యం అణచివేతకు గురవుతున్నాయని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు వ్యాపారం, రాజకీయాల్లో రాణించడంతోపాటు ఇళ్లలోనూ స్వేచ్ఛగా మాట్లాడే హక్కు కలిగి ఉండాలని అన్నారు. ఇతరులు అంగీకరించకపోయినా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, భర్తలు, సోదరులను ప్రశ్నించే స్వేచ్ఛ మహిళలకు ఉండాలని రాహుల్ అన్నారు. దేశం నిజమైన అభివృద్ధి సాధించాలంటే పురుషాధిక్య, పితృస్వామ్య నియంత్రణ నుంచి మహిళలకు విముక్తి కల్పించాలని స్పష్టం చేశారు. మహిళలను సామాజిక సంభాషణలోకి తిరిగి తీసుకురావడంతోపాటు వారు తమకు నచ్చిన విధంగా జీవించేలా అవకాశాలు కల్పించాలన్నారు.

### అన్నిరంగాల్లో సమాన అవకాశాలివ్వాలి

విద్య, కార్పొరేట్ రంగాలతో పాటు సమాజంలోని ప్రతి రంగంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని రాహుల్ పేర్కొన్నారు. వాస్తవానికి సమాన స్థానం కంటే మహిళలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. 'ఆస్క్ మీ ఎనీథింగ్' కార్యక్రమంలో యువతులు చదువుకునే హక్కు కోసం పోరాడటంపై అడిగిన ప్రశ్నకు రాహుల్ స్పందిస్తూ.. 'భారత మహిళలు మన బలం.. మన అతిపెద్ద ఆస్తి' అని పేర్కొన్నారు.

## ఈ20పై రాహుల్ గాంధీ ఫైర్!

ఈ20 ఇంధన విధానం చాలా పెద్ద సమస్యగా మారిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ20 ఇంధనం ప్రజల వాహనాలను దెబ్బతీయడంతో పాటు వారిని నేరుగా దోచుకుంటోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అవినీతి విపరీతంగా ఉందని విమర్శించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శుక్రవారం విడుదల చేసిన వీడియోలో రాహుల్ ఈ20 అంశాన్ని ప్రస్తావించారు. సాధారణంగా పప్పులో ఏదో నల్లగా ఉందని అంటాం.. కానీ ఇక్కడ పప్పంతా నల్లగానే ఉంది' అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అనేక సమస్యలు ఉన్నప్పటికీ.. వాటిని ఏ క్రమంలో లేవనెత్తాలన్నదే తమ ముందున్న సవాల్ అని ఆయన పేర్కొన్నారు. ఈ20 విధానం స్కూటర్లను, ప్రజల జీవితాలను దెబ్బతీస్తోందని ఆరోపిస్తూ.. కాంగ్రెస్ ఈ అంశాన్ని భారీ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్తుందని రాహుల్ వెల్లడించారు.

## రాహుల్ ప్రయాగ్‌రాజ్ సభకు అనుమతి

ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్ గాంధీ తలపెట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం)సభకు యోగీ సర్కారు అనుమతిచ్చింది. పేపర్ లీకులు, నిరుద్యోగంపై విద్యార్థులతో రాహుల్ గాంధీ ఈసభలో ముఖాముఖి చర్చించనున్నారు. అయితే ముందుగా సభా వేదిక అయిన పీ గ్రౌండ్‌కు గతంలో ఇచ్చిన అనుమతిని రద్దు చేసి తీవ్ర ఉత్కంఠకు కారణమైన కాయస్థ పాఠశాల (పీ) ట్రస్ట్.. గురువారం అర్ధరాత్రి వెనక్కి తగ్గింది. కొన్ని షరతులతో సభ నిర్వహణకు మళ్లీ అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. సదస్సుకు పర్మిషన్ రావడంతో కాంగ్రెస్ శ్రేణులు సభా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు పీ గ్రౌండ్‌లో వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువతతో నేరుగా సంభాషిస్తారు రాహుల్ గాంధీ.



# ఎంఎస్ఎంఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- విపక్షాల ఆందోళనల మధ్యే మూజువాణి ఓటుతో ఆమోదం
- చిన్న, మధ్యతరహా సంస్థలకు ఆలస్య చెల్లింపుల సమస్యకు పరిష్కారం
- ఆరు నెలలు పెండింగ్‌లో ఉంటే 50 శాతం బకాయిల చెల్లింపునకు వెసులుబాటు

**న్యూఢిల్లీ:** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ)కు ఎదురవుతున్న ఆలస్య చెల్లింపుల సమస్యను పరిష్కరించేందుకు ఉద్దేశించిన ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ (సవరణ) బిల్లు–2026కు లోక్‌సభ శుక్రవారం ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును రాజ్యసభ ఆగస్టు 3న ఆమోదించింది. ఎంఎస్ఎంఈలకు బకాయిల చెల్లింపులు వేగంగా జరిగేలా వివాదాల పరిష్కారానికి కాలపరిమితులు విధించడం, సెటిల్‌మెంట్ ఒప్పందాల అమలుకు వీలు కల్పించడం వంటి నిబంధనలను బిల్లులో చేర్చారు. ఆరు నెలలకు పైగా కేసు పెండింగ్‌లో ఉంటే.. అవార్డు చేసిన మొత్తంలో కనీసం 50 శాతాన్ని ఎంఎస్ఎంఈ సరఫరాదారులకు చెల్లించాలని కోర్టులు ఆదేశించే అవకాశం కల్పించారు.

### ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర

దేశ జీడీపీలో ఎంఎస్ఎంఈల వాటా 31 శాతం, తయారీ రంగంలో 36 శాతం, ఎగుమతుల్లో 41 శాతంగా ఉందని కేంద్రం తెలిపింది. 2014–15లో ఎంఎస్ఎంఈలకు అందిన రుణాలు రూ.10 లక్షల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం రూ.38.35 లక్షల కోట్లకు పెరిగాయని కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీ రాజ్యసభలో వెల్లడించారు. విపక్షాల నిరసనలతో లోక్‌సభలో జీరో అవర్ కూడా సజావుగా సాగలేదు. దాదాపు 16 నిమిషాల పాటు జరిగిన సభా కార్యక్రమాల్లోనే బిల్లును ఆమోదించిన అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు.

# సౌదీకి భద్రత 'కూటమి'తో రాదు!

- టర్కీ, పాక్‌తో రక్షణ ఒప్పందంపై ఇరాన్ ఫైర్
- ఇతరులపై ఆధారపడకుండా విధానాలు మార్చుకోండి
- ఇరాన్ ఎంపీ ఇబ్రహీం రెజాయి



**దుబాయ్:** సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్ మధ్య కుదిరిన సంయుక్త రక్షణ ఒప్పందంపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఒప్పందం సౌదీ అరేబియాకు భద్రత కల్పించలేదని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రత, విదేశాంగ విధాన కమిటీ సభ్యుడు ఇబ్రహీం రెజాయి విమర్శించారు. ఇతరుల నుంచి భద్రతను కోరుకునే పరిస్థితి రాకుండా సౌదీ తన విధానాలను మార్చుకోవాలని సూచించారు. సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మక్కాలో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం మూడు దేశాల్లో ఏదైనా ఒకదానిపై దాడి జరిగితే.. మూడింటిపై దాడిగా పరిగణించి పరస్పరం రక్షణ సహకారం అందించనున్నాయి.

### సైనిక కూటమి కాదు..

ఈ ఒప్పందం సైనిక కూటమి కాదని సౌదీ స్పష్టం చేసింది. ఇది మతపరమైన లేదా ప్రాంతీయ సైనిక కూటమిని ఏర్పాటు చేసే ప్రయత్నం కాదని పేర్కొంది. అణు కార్యక్రమాలు, ఆయుధ పోటీతో దీనికి సంబంధం లేదని తెలిపింది. తమకు ఇప్పటికే ఉన్న గల్ఫ్, అరబ్, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ఈ ఒప్పందం ఎలాంటి విఘాతం కలిగించదని స్పష్టం చేసింది. టర్కీ కూడా ఒప్పందం పూర్తిగా రక్షణాత్మకమైనదేనని పేర్కొంది. ఇది ఏ ఒక్క దేశాన్ని లక్ష్యంగా చేసుకుని కుదుర్చుకున్నది కాదని, అవసరమైతే ఇతర ప్రాంతీయ దేశాలు కూడా ఇందులో చేరవచ్చని తెలిపింది.

### ఒకే వేదికపై మూడు దేశాల బలాలు

రక్షణ రంగంలో పరస్పర సహకారంతో పాటు రక్షణ పరిశ్రమ, సైనిక సమన్వయాన్ని పెంచుకోవడం ఈ ఒప్పందం లక్ష్యమని టర్కీ అధికారులు తెలిపారు. పాకిస్థాన్ సైనిక అనుభవం, సౌదీ ఆర్థిక బలం, టర్కీ రక్షణ సాంకేతిక సామర్థ్యాలు మూడు దేశాలకు పరస్పర ప్రయోజనం చేకూరుస్తాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రాంతీయ అస్థిరత, అంతర్యుద్ధాలు, సాయుధ ప్రభుత్వేతర సంస్థల పెరుగుదల నేపథ్యంలో మూడు దేశాల మధ్య భద్రతా సహకారం మరింత బలపడుతోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# ఎల్‌ఏసీ పరిస్థితిపై భారత్ - చైనా చర్చలు

### సరిహద్దు సమస్యలు, బోర్డర్ మేనేజ్‌మెంట్‌పై సమీక్ష

**న్యూఢిల్లీ:** భారత్–చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంట పరిస్థితిపై ఇరు దేశాలు సమీక్ష నిర్వహించాయి. సరిహద్దు నిర్ణయం, సరిహద్దు నిర్వహణ, సరిహద్దు అవతలి సహకారానికి సంబంధించిన కీలక అంశాలపై దౌత్య చర్చలు జరిపినట్లు విదేశాంగ శాఖ (ఎంఈఏ) శుక్రవారం వెల్లడించింది. ఎల్‌ఏసీ వెంట అపరిష్కృత సమస్యలను పరిష్కరించేందుకు దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని ఇరు దేశాలు అంగీకరించాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల సమగ్ర అభివృద్ధికి అత్యంత అవసరమని భారత్ స్పష్టం చేసింది. భారత్–చైనా సరిహద్దు వ్యవహారాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం ఏర్పాటు చేసిన వర్కింగ్ మెకానిజం (డబ్ల్యూఎంసీసీ) పరిధిలో గురువారం ఈ చర్చలు జరిగాయి. ఎల్‌ఏసీ వెంట అపార్థాలు, అనుకోని ఉద్రిక్తతలు తలెత్తకుండా డబ్ల్యూఎంసీసీతో పాటు స్థానిక కమాండర్ స్థాయి సమావేశాలు, ఇతర అంగీకరించిన మార్గాలను వినియోగించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.



# ట్రంప్ ఒత్తిడితోనే ఈ20 విధానం!

- అమెరికా ఇథనాల్‌కు మార్కెట్ కల్పించేందుకే కేంద్రం నిర్ణయం
- ఆప్ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్

**పనాజీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం ఈ20 ఇంధన విధానాన్ని అమలు చేసిందని ఆప్ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అమెరికాలో మిగిలిపోతున్న ఇథనాల్‌కు భారత్‌లో మార్కెట్ కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. పెట్రోల్ బంకులు, నిల్వ ట్యాంకులు, ట్యాంకర్లను మార్చకుండా.. ఈ20కు అనుకూలంగా లేని కోట్లాది వాహనాలు రోడ్లపై ఉండగానే విధానాన్ని అమలు చేశారని కేజ్రీవాల్ అన్నారు. గత ఏడాది అమెరికా నుంచి భారత్ ఒక బిలియన్ లీటర్ల ఇథనాల్ దిగుమతి చేసుకోగా, ఈ ఏడాది ఐదు బిలియన్ లీటర్లు దిగుమతి చేసుకోనుందని పేర్కొన్నారు. 2023కు ముందు తయారైన దాదాపు 30 కోట్ల వాహనాలు ఈ20కు అనుకూలంగా లేవని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఈ30, ఈ40 మిశ్రమాలను తీసుకొచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వం దీర్ఘకాలిక విధానాన్ని స్పష్టం చేసే వరకు పెట్రోల్, డీజిల్ వాహనాలు కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు. ఈ20పై నిర్వహించిన అధ్యయనాల నివేదికలను బహిర్గతం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# లంక స్పిన్నర్లపై దూకుడుగా ఆడాలి!

- ఎక్కువగా డిఫెన్సివ్ ఆడొద్దు
- సొంత గేమ్ ప్లాన్‌తో చురుగ్గా ఆడితేనే మంచి ఫలితాలు
- భారత బ్యాటర్లకు మాజీ కెప్టెన్ అజింక్య రహానే సూచన



**బెంగళూరు:** శ్రీలంక స్పిన్నర్లను ఎదుర్కొనే విషయంలో భారత బ్యాటర్లు మరింత దూకుడుగా, చురుగ్గా ఆడాలని మాజీ కెప్టెన్ అజింక్య రహానే సూచించాడు. 15 నుంచి గాలే వేదికగా ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య జట్టును తక్కువగా అంచనా వేయొద్దని అన్నాడు. శ్రీలంకలో తొలి రోజు పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించాడు. శ్రీలంకలో బ్యాటర్‌గా బౌలర్‌పై ఆధిపత్యం ప్రదర్శించడం ఎంతో ముఖ్యమని రహానే పేర్కొన్నాడు. 'మరీ ఎక్కువగా డిఫెన్సివ్‌గా ఆడకూడదు. మన సొంత గేమ్ ప్లాన్‌తో ముందుకెళ్లాలి. శ్రీలంకలో స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌లు ఉంటాయి. వారి జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. అందుకే మన బ్యాటర్లు ఆధిపత్య ధోరణిలో ఆడాలి' అని అన్నాడు. 2017లో శ్రీలంక పర్యటనలో భారత్ 3–0తో టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడంలో రహానే కీలక పాత్ర పోషించాడు. ఆ సిరీస్‌లో 200కుపైగా పరుగులు చేసిన అతను ఓ సెంచరీ, ఓ అర్ధసెంచరీ సాధించాడు. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే.. స్వదేశీ జట్టును ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకూడదని పేర్కొన్నాడు.

### మారుతున్న టెస్టు క్రికెట్

టీ20 క్రికెట్ ప్రభావంతో టెస్టు బ్యాటింగ్ తీరు పూర్తిగా మారిపోయిందని రహానే అభిప్రాయపడ్డాడు. టెస్టుల్లోనూ స్కూప్, ల్యాప్, స్విచ్ హిట్, రివర్స్ స్వీప్ వంటి షాట్లను ఆటగాళ్లు తరచూ ఆడుతున్నారని చెప్పాడు. వివిధ ఫార్మాట్లకు వేగంగా అలవాటు పడటం ఆధునిక క్రికెట్‌లో అత్యంత కీలకమని పేర్కొన్నాడు. పోటీకి అనుగుణంగా బౌలర్లు కూడా తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటున్నారని రహానే తెలిపాడు. టెస్టుల్లోనూ యార్కర్లు, కొత్త తరహా సీమ్ బంతులు వేయడంపై బౌలర్లు దృష్టి పెడుతున్నారని పేర్కొన్నాడు.

### సేవలందించేందుకు సిద్ధం

రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ క్రికెట్‌కు దూరంగా ఉండాలనే ఆలోచన తనకు లేదని రహానే స్పష్టం చేశాడు. ఇంకా కొన్నేళ్లు క్రికెట్ ఆడాలనుకుంటున్నానని, ఐపీఎల్ జట్టుకు మెంటార్‌గా లేదా కోచ్‌గా పనిచేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. తన అనుభవాన్ని యువ క్రికెటర్లతో పంచుకోవడం ద్వారా తా నూ కొత్త విషయాలు నేర్చుకుంటానని పేర్కొన్నాడు.

# లంక బ్యాటర్లను తిప్పేసిన స్పిన్నర్లు

- వార్మప్ మ్యాచ్‌లో రాణించిన కుల్దీప్, సుందర్, జడేజా
- తొలి ఇన్నింగ్స్‌లో ఎస్ఎల్‌సీ ఎలెవన్ 363/8







**కొలంబో:** శ్రీలంక పర్యటనలో భాగంగా జరుగుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తొలి సెషన్‌లో తడబడినా.. చివరి సెషన్‌లో స్పిన్నర్లు పుంజుకున్నారు. కుల్దీప్ యాదవ్ నేతృత్వంలోని స్పిన్ దళం వరుస వికెట్లు తీయడంతో శ్రీలంక క్రికెట్ బోర్డు ఎలెవన్ తొలి ఇన్నింగ్స్‌లో 363/8 వద్ద ఆట ముగించింది. టెస్టు స్థాయి హోదా లేని ఈ మ్యాచ్‌లో శ్రీలంక యువ బ్యాటర్లు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో (66: 65 బంతుల్లో), రవిందు రసంత (71: 143 బంతుల్లో) కలిసి తొలి వికెట్‌కు 110 పరుగులు జోడించారు. భారత పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలకు వికెట్లు దక్కలేదు. గుర్నూర్ బ్రార్ (1/49) మాత్రం పేసర్లలో ప్రభావం చూపాడు.

### కుల్దీప్ కమ్‌బ్యాక్

తొలి స్పెల్‌లో ఐదు ఓవర్లకు 29 పరుగులు ఇచ్చిన కుల్దీప్ ఆ తర్వాత బౌలింగ్‌లో వేగాన్ని మార్చి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. అహాన్ విక్రమసింఘే, అంజల బండారలను ఔట్ చేసి 18 ఓవర్లలో 2/76తో నిలిచాడు. మానవ్ సుతార్ (1/30) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. మధ్య ఓవర్లలో సోనాల్ దినూషా (52: 72 బంతుల్లో) ఆకట్టుకున్నాడు. కుల్దీప్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ అద్భుతమైన సిక్సర్ బాదాడు. రమేశ్ మెండిస్ (32)తో కలిసి ఏడో వికెట్‌కు 64 పరుగులు జోడించాడు. రవీంద్ర జడేజా 2/64తో రెండు వికెట్లు తీసినా.. బౌలింగ్‌లో తుప్పుపట్టినట్లు కనిపించాడు.

### భారత్–శ్రీలంక టెస్టులకు ఫ్రీ ఎంట్రీ!

భారత్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ) అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పించనుంది. ఆగస్టు 15 నుంచి గాలేలో ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో మ్యాచ్‌లను ఉచితంగా ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. తొలి టెస్టు ఆగస్టు 15న గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలో ప్రారంభం కానుంది. రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు, యువ ఔత్సాహిక క్రికెటర్లు, కుటుంబాలు, క్రీడాభిమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రపంచస్థాయి టెస్టు క్రికెట్‌ను ప్రత్యక్షంగా ఆస్వాదించాలని ఎస్ఎల్‌సీ కోరింది.

### టెస్టులకు తగ్గుతున్న ఆదరణ

శ్రీలంకలో టెస్టు క్రికెట్ మ్యాచ్‌లకు సాధారణంగా ప్రేక్షకుల హాజరు తక్కువగా ఉంటుంది. గతంలో భారత జట్టు పర్యటనల్లోనూ స్టాండ్లు ఖాళీగా కనిపించిన సందర్భాలున్నాయి. ఉపఖండంలో టెస్టు క్రికెట్‌కు ప్రేక్షకాదరణ పరంగా కోల్‌కతా, చెన్నై, ముంబై, బెంగళూరు వంటి కొన్ని భారత నగరాలు మాత్రమే మినహా పెద్దగా ఆదరణ లభించడం లేదని గణాంకాలు సూచిస్తున్నాయి.

# అరిహా 'గోల్డెన్' విన్యాసం!

- ఏరోబిక్ జిమ్నాస్టిక్స్ ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలిసారి స్వర్ణం
- ఫైనల్లో 19.100 పాయింట్లు
- కళాత్మకత, ఎగ్జిక్యూషన్, డిఫికల్టీలో అదరగొట్టిన పంగంబమ్

**న్యూఢిల్లీ:** ఏరోబిక్ జిమ్నాస్టిక్స్ ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి అరిహా పంగంబమ్ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. సీనియర్ మహిళల వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డు సృష్టించింది. ఫైనల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన అరిహా 19.100 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుని భారత్‌కు ఈ విభాగంలో తొలి స్వర్ణాన్ని అందించింది. ఫైనల్ ప్రదర్శనలో అరిహా కళాత్మకతకు 8.650, ఎగ్జిక్యూషన్‌కు 7.600, డిఫికల్టీకి 2.850 పాయింట్లు సాధించింది. అన్ని విభాగాల్లోనూ సమర్థవంతమైన ప్రదర్శనతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఏరోబిక్ జిమ్నాస్టిక్స్‌లో ఆసియా స్థాయిలో భారత్ కొత్త అధ్యాయాన్ని లిఖించింది. అరిహా చారిత్రక విజయంపై జిమ్నాస్టిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సుధీర్ మిట్టల్ హర్షం వ్యక్తం చేశారు. అరిహా అద్భుతంగా రాణించిందని ప్రశంసించారు. "ఇది మాకు గొప్ప విజయం. అరిహా చాలా బాగా ప్రదర్శించింది. ఆమెతో పాటు కోచ్‌కు అభినందనలు' అని అన్నారు.



## ప్రజ్ఞానందకు సెయింట్ లూయిస్ టైటిల్

**సెయింట్ లూయిస్:** భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్‌ను తొలిసారి కైవసం చేసుకున్నాడు. 23.5 పాయింట్లతో రౌండ్ మిగిలుండగానే చాంపియన్‌గా నిలిచాడు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన జావోఖిర్ సిందరోవ్ 22 పాయింట్లతో రెండో స్థానంలో, అమెరికా ఆటగాడు వెస్లీ సో 20.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు. ర్యాపిడ్ విభాగాన్ని ఒక్క పాయింట్ ఆధిక్యంతో గెలిచిన ప్రజ్ఞానంద.. బ్లిట్జ్‌లో 18 పాయింట్లకు 11.5 సాధించాడు. ఈ విజయంతో గ్రాండ్ చెస్ టూర్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఆగస్టు 10 నుంచి జరిగే సిన్‌క్వేఫీల్డ్ కప్‌లోనూ రాణిస్తే గ్రాండ్ ఫైనల్‌కు అర్హత సాధించే అవకాశాలు మెరుగవుతాయి. 'ఇది ర్యాపిడ్, బ్లిట్జ్‌లో నా తొలి పెద్ద విజయం. ఎంతో సంతోషంగా ఉంది. నా జట్టు, కుటుంబ సభ్యుల కు కృతజ్ఞతలు' అని ప్రజ్ఞానంద పేర్కొన్నాడు.




# భారీగా పెరిగిన దేశ, విదేశీ మారక నిల్వలు

- ఒకే వారంలో 10.51 బిలియన్ డాలర్ల జంప్
- మొత్తం నిల్వలు 692.87 బిలియన్ డాలర్లకు చేరిక

**ముంబై:** భారత విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు మరోసారి భారీగా పెరిగాయి. జూలై 31తో ముగిసిన వారంలో 10.512 బిలియన్ డాలర్లు పెరిగి మొత్తం నిల్వలు 692.866 బిలియన్ డాలర్లకు చేరినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు వారంలో కూడా నిల్వలు 6.118 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సీఏ) 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 564.68 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్‌తో పోలిస్తే యూరో, పౌండ్, యెన్ వంటి కరెన్సీల విలువల్లో వచ్చిన మార్పులు కూడా ఈ ఆస్తులపై ప్రభావం చూపుతాయని ఆర్‌బీఐ తెలిపింది. దేశ బంగారం నిల్వల విలువ 1.685 బిలియన్ డాలర్లు పెరిగి 104.743 బిలియన్ డాలర్లకు చేరింది. అలాగే ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు (ఎస్‌డీఆర్‌లు) 48 మిలియన్ డాలర్లు పెరిగి 18.666 బిలియన్ డాలర్లకు చేరగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత రిజర్వు స్థానం 28 మిలియన్ డాలర్లు పెరిగి 4.778 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

### రికార్డు స్థాయికి చేరువలో నిల్వలు

ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 728.494 బిలియన్ డాలర్లతో చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరాయి. అనంతరం పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రూపాయి విలువను నిలబెట్టేందుకు ఆర్‌బీఐ చేపట్టిన జోక్యంతో నిల్వలు తగ్గినా, ఇటీవల విదేశీ నిధుల ప్రవాహం పెరగడంతో మళ్లీ వృద్ధి బాట పట్టాయి. ఎఫ్‌సీఎన్ఆర్(బీ) వంటి చర్యల ద్వారా ఇప్పటివరకు సుమారు 32 బిలియన్ డాలర్ల విదేశీ నిధులు దేశంలోకి వచ్చినట్లు సమాచారం.

# ఆర్‌బీఐ హెచ్‌ఆర్ విధానాలపై అధికారుల అసంతృప్తి

**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా మానవ వనరుల (హెచ్‌ఆర్) విధానాలపై ఆర్‌బీఐ అధికారుల సంఘం (ఆర్‌బీఐఓఏ) అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారుల కెరీర్ పురోగతి, మనోధైర్యం, ఉద్యోగ సంక్షేమంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొంటూ హెచ్‌ఆర్ విధానాలను తక్షణమే పునఃసమీక్షించాలని గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు విజ్ఞప్తి చేసింది. ఇదిలాఉంటే ఆగస్టు 6న గవర్నర్‌కు పంపిన వినతిపత్రంలో సభ్యుల సర్వే వివరాలను సంఘం ప్రస్తావించింది. గ్రేడ్–ఏ నుంచి గ్రేడ్–ఈ వరకు ఉన్న అధికారుల్లో సగానికి పైగా ఈ సర్వేలో పాల్గొన్నారని తెలిపింది. సర్వేలో 85 శాతం మంది పదోన్నతులకు సరైన అవకాశాలు కనిపించడం లేదని, 79 శాతం మంది తమ మనోధైర్యం తక్కువ స్థాయిలో ఉందని వెల్లడించారు. మే నెలలో తీసుకొచ్చిన కొత్త ప్రమోషన్ విధానాన్ని 91 శాతం మంది వ్యతిరేకించారు. ఉద్యోగుల సంక్షేమ సౌకర్యాల్లో ఇటీవల చేసిన మార్పులపై కూడా అసంతృప్తి వ్యక్తమైంది.

# ఎస్‌బీఐకి రికార్డు లాభాలు

- తొలి త్రైమాసికంలో రూ.24,113 కోట్ల నికర లాభం
- ప్రొవిజన్లు తగ్గడంతో 13.73% వృద్ధి
- రుణాల్లో 18.63% పెరుగుదల



**ముంబై:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయి ఆర్థిక ఫలితాలు నమోదు చేసింది. ఏకీకృత (కన్సాలిడేటెడ్) ప్రాతిపదికన నికర లాభం 13.73 శాతం పెరిగి రూ.24,113 కోట్లకు చేరగా, స్టాండలోన్ ప్రాతిపదికన లాభం 10.23 శాతం వృద్ధితో రూ.21,121.22 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.19,160.44 కోట్లుగా ఉంది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) దాదాపు 15 శాతం పెరిగి రూ.46,992 కోట్లకు చేరింది. స్థూల రుణాలు 18.63 శాతం పెరగడం ఇందుకు ప్రధాన కారణమైంది. దేశీయ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిని కొనసాగించగలమని ఎస్‌బీఐ చైర్మన్ సి.ఎస్. శెట్టి తెలిపారు. ఈ ఏడాది రుణాల వృద్ధి 14–15 శాతం ఉంటుందని అంచనా వేశారు.

### ఎన్‌పీఏలు తగ్గింపు

బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తుల (గ్రాస్ ఎన్‌పీఏ) నిష్పత్తి గత ఏడాది 1.83 శాతం నుంచి 1.47 శాతానికి తగ్గింది. ఎన్‌పీఏల కోసం చేసిన ప్రొవిజన్లు కూడా రూ.4,934 కోట్ల నుంచి రూ. 3,359 కోట్లకు తగ్గాయి. అయితే తాజా స్లిప్పేజీలు రూ.7,046 కోట్లుగా నమోదయ్యాయి.ఇక డిపాజిట్లు 9.73 శాతం పెరిగాయి. బ్యాంకు మూలధన సమృద్ధి నిష్పత్తి (సీఏఆర్) 15.67 శాతంగా ఉండగా, కోర్ ఈక్విటీ నిష్పత్తి 12.89 శాతంగా నమోదైంది. కార్పొరేట్ రుణాల పైప్‌లైన్ రూ.3.6 లక్షల కోట్లుగా ఉందని మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని కుమార్ తివారీ తెలిపారు. ప్రత్యేక ఎఫ్‌సీఎన్ఆర్(బీ) పథకం కింద ఇప్పటికే 6 బిలియన్ డాలర్ల డిపాజిట్లు సమీకరించామని, సెప్టెంబర్ నాటికి వాటిని 10 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ఉన్నామని చైర్మన్ సి.ఎస్. శెట్టి వెల్లడించారు. విదేశీ భారతీయుల డిపాజిట్లతో దేశీయంగా అధిక వడ్డీ డిపాజిట్లపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని ఆయన చెప్పారు.

## పెరిగిన ముత్తూట్ మైక్రోఫిన్ ఆదాయం

**న్యూఢిల్లీ:** ఎన్‌బీఎఫ్‌సీ–మైక్రో ఫైనాన్స్ సంస్థ ముత్తూట్ మైక్రోఫిన్ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయి వృద్ధిని నమోదు చేసింది. రుణాల పంపిణీ గణనీయంగా పెరగడంతో కంపెనీ నికర లాభం గత ఏడాది రూ.6 కోట్లతో పోలిస్తే ఏకంగా రూ.81 కోట్లకు చేరింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.559 కోట్ల నుంచి రూ.671 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో రుణాల పంపిణీ 49 శాతం వృద్ధితో రికార్డు స్థాయిలో రూ.2,645 కోట్లకు చేరింది. వ్యయాలు మాత్రం స్వల్పంగా పెరిగి రూ.553 కోట్ల నుంచి రూ.564 కోట్లకు నమోదయ్యాయి. కంపెనీ స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత ఏడాది 4.85 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గింది. అలాగే నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 11.5 శాతం నుంచి 12 శాతానికి మెరుగుపడింది. ఈ ఫలితాలు కంపెనీ రుణ వ్యాపారం, ఆస్తుల నాణ్యత మరింత బలోపేతమవుతున్న సంకేతాలుగా సంస్థ పేర్కొంది.

# పైలట్లకు ఎయిరిండియా కొత్త విధానం

- కమాండర్ కావాలంటే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు తప్పనిసరి బదిలీ

**న్యూఢిల్లీ/ముంబై:** టాటా గ్రూప్‌కు చెందిన ఎయిరిండియా తన పైలట్ల పదోన్నతి విధానంలో కీలక మార్పులు చేపట్టింది. ఇకపై న్యారోబాడీ, వైడ్‌బాడీ విమానాలకు కమాండర్లుగా పదోన్నతి పొందాలనుకునే అర్హత కలిగిన సీనియర్ ఫస్ట్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు బదిలీ కావాల్సి ఉంటుందని సంస్థ వర్గాలు తెలిపాయి. ఉమ్మడి సీనియారిటీ పూల్ ఆధారంగా ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో బోయింగ్ 737 విమానాలకు కమాండర్లుగా బాధ్యతలు చేపట్టే సీనియర్ ఫస్ట్ ఆఫీసర్లకు ఒకేసారి రూ.10 లక్షల బోనస్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న బోయింగ్ 737 కమాండర్లకు మూడేళ్లలో రూ.21 లక్షల ప్రోత్సాహకం చెల్లించనున్నారు. కమాండర్‌గా పదోన్నతి పొందిన తర్వాత సంస్థ కేటాయించిన ఆపరేటింగ్ బేస్‌లో కనీసం రెండేళ్లు పనిచేయాల్సి ఉంటుంది.

### విమానాల విస్తరణకు అనుగుణంగా నిర్ణయం

రాబోయే కాలంలో బోయింగ్ 737 న్యారోబాడీ విమానాలు పెద్ద సంఖ్యలో చేరనున్న నేపథ్యంలో కమాండర్ల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఎయిరిండియా 3,500 మందికి పైగా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో 2,000 మందికి పైగా పైలట్లు ఉన్నారు. రెండు సంస్థల కలిపి సుమారు 300 విమానాలున్నాయి.

### పైలట్లలో భిన్నాభిప్రాయాలు

ఈ కొత్త విధానాన్ని శుక్రవారం టౌన్‌హాల్ సమావేశంలో పైలట్లకు వివరించారు. అయితే ఎయిరిండియా నుంచి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు బదిలీ లేఖలు ఇస్తూ అంగీకరించాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇది పరోక్షంగా బలవంతపు రాజీనామా వంటిదేనని కొందరు పైలట్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

# బ్యాంకింగ్ షేర్ల ఒత్తిడితో మార్కెట్ డౌన్

- 455 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్.. నిఫ్టీకి 65 పాయింట్ల నష్టం




**ముంబై:** వరుసగా రెండు రోజుల లాభాల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 80 డాలర్లకు పైగా కొనసాగడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో సూచీలు వెనక్కి తగ్గాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 455.59 పాయింట్లు (0.58%) పడిపోయి 78,499.17 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 65.35 పాయింట్లు (0.27%) కోల్పోయి 24,570.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 577 పాయింట్లు, నిఫ్టీ 113 పాయింట్ల వరకు క్షీణించాయి. ఆర్‌బీఐ ప్రతిపాదించిన కొత్త నిబంధనల ప్రభావంతో ఎన్‌బీఎఫ్‌సీ షేర్లలో అమ్మకాలు పెరిగాయి. బజాజ్ ఫైనాన్స్ 5.90 శాతం, బజాజ్ ఫిన్‌సర్వ్ 4.18 శాతం పతనమయ్యాయి. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ట్రెంట్, ఏషియన్ పెయింట్స్ కూడా నష్టాల్లో ముగిశాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభపడ్డాయి. రంగాల వారీగా ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రైవేట్ బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్, ఇన్సూరెన్స్ సూచీలు నష్టపోగా.. ఐటీ, ఆటో, పీఎస్‌యూ బ్యాంకులు, హెల్త్‌కేర్ సూచీలు లాభాల్లో ముగిశాయి.

### వారాంతానికి మాత్రం లాభమే

వారం మొత్తంగా చూస్తే సెన్సెక్స్ 404.53 పాయింట్లు, నిఫ్టీ 187.05 పాయింట్లు లాభపడ్డాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) గురువారం రూ.17.86 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 82.20 డాలర్ల వద్ద కొనసాగింది. పశ్చిమాసియా పరిస్థితులు, అమెరికా ఉద్యోగ గణాంకాలపై ఎదురుచూపులు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయని స్టాక్ మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# యూపీఐపై ఆందోళన అక్కర్లేదు

- వినియోగదారులు, చిన్న దుకాణాలపై ఛార్జీలుండవు




**న్యూఢిల్లీ:** యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) లావాదేవీలపై వినియోగదారులు, చిన్న వ్యాపారులు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) స్పష్టం చేసింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో యూపీఐపై ఛార్జీలపై వస్తున్న ప్రచారానికి కౌన్సిల్ వివరణ ఇచ్చింది. యూపీఐ ప్రారంభమైన 2016 నుంచే వినియోగదారులకు సేవలు పూర్తిగా ఉచితమని, అలాగే కిరాణా దుకాణాలు సహా చిన్న వ్యాపారులు కూడా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చెల్లించకుండా యూపీఐ చెల్లింపులు స్వీకరించవచ్చని తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థగా ఎదిగిన యూపీఐ మౌలిక వసతులను దీర్ఘకాలికంగా బలోపేతం చేసే ఆర్థిక నమూనా రూపకల్పనపైనే ఉన్నాయని పేర్కొంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఎండీఆర్ అనేది వినియోగదారులపై కాకుండా వ్యాపారులపై మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. యూపీఐ వ్యవస్థ అభివృద్ధికి బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఎన్‌పీసీఐ, ఆర్‌బీఐ దశాబ్దకాలంగా సాంకేతికత, సైబర్ భద్రత, మోసాల నివారణ, వినియోగదారుల సేవలపై భారీగా పెట్టుబడులు పెట్టాయని పీసీఐ పేర్కొంది. భవిష్యత్తులో పెద్ద వ్యాపారులపై సేవా రుసుములు విధించినా, వినియోగదారులకు ఉచితమేనని స్పష్టం చేసింది.



# మహిళా పాత్రలకు కొత్త ఊపు

ఒకప్పుడు వరుస ప్రేమకథలతో బాలీవుడ్ ప్రేక్షకుల మనసు దోచుకున్న కథానాయిక కాజోల్.. ఇప్పటికీ తన ప్రత్యేక నటనతో ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న సినీ ప్రయాణంలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించిన ఆమె.. ప్రస్తుతం సినిమాలతో పాటు ఓటీటీ వేదికపైనా తనదైన ముద్ర వేస్తున్నారు. కథ, పాత్రల ఎంపిక విషయంలో మొదటి నుంచి రాజీపడని కాజోల్.. ఇకపై మరింత కొత్త తరహా పాత్రల్లో కనిపించాలని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తన కెరీర్, ప్రయోగాలపై ఆసక్తి, మహిళా ప్రాధాన్య కథల్లో వస్తున్న మార్పులు, సినీ పరిశ్రమలో మహిళలకు పెరుగుతున్న అవకాశాల గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. “నటిగా నా ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఒక విషయాన్ని మాత్రం ఎప్పుడూ మార్చుకోలేదు. నాకు నిజంగా నచ్చిన కథలు, నా నటనకు కొత్త కోణాన్ని చూపించే పాత్రలు, ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే అవకాశమున్న పాత్రలనే ఎంపిక చేసుకుంటూ వచ్చాను. ఒక పాత్ర ద్వారా నేను ప్రత్యేకంగా ఏదైనా చేయగలననే నమ్మకం కలిగితేనే ఆ ప్రాజెక్ట్‌కు అంగీకరిస్తాను. ఆ విషయంలో ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. అయితే ఇప్పుడు మరింత భిన్నమైన పాత్రలు చేయాలనే ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు చేయని కథల్లో నటించాలని, సరికొత్త పాత్రల ద్వారా ప్రేక్షకులను ఆశ్చర్యపరచాలని అనుకుంటున్నాను'' అని కాజోల్ తెలిపారు. కథ నచ్చడం ఒక్కటే కాదు.. ఆ పాత్రలో తనకు పూర్తి విశ్వాసం ఉండటం కూడా ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. “ఒక పాత్రను అంగీకరించే ముందు దానిలో నటిగా నాకు ఎంత అవకాశం ఉంది? కథలో ఆ పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉంది? ప్రేక్షకులకు అది ఎంత బలంగా చేరుతుంది? అనే అంశాలను తప్పకుండా పరిశీలిస్తాను. ఏదైనా పాత్ర విషయంలో నాకు నమ్మకం కలగకపోతే ఎంత పెద్ద సినిమా అయినా చేయను. కథ లేదా పాత్ర నచ్చకపోతే ఎలాంటి సందేహం లేకుండా వెంటనే 'నో' చెబుతాను. కెరీర్‌లో ఎన్నో అవకాశాలు వచ్చినా, నాకు సరిపోతాయని అనిపించిన వాటినే ఎంపిక చేసుకున్నాను. అదే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని భావిస్తాను'' అని చెప్పారు. మొత్తంగా, పాత్రల ఎంపికలో నాణ్యతకే పెద్దపీట వేస్తూ, మహిళా పాత్రలకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని స్వాగతిస్తున్న కాజోల్.. భవిష్యత్తులో మరింత వైవిధ్యభరితమైన కథల్లో నటించి తన నటనా ప్రయాణానికి కొత్త అధ్యాయాన్ని జోడించాలని భావిస్తున్నట్లు ఆమె వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# ఆసక్తికరంగా 'కింగ్ జాకీ క్వీన్'



ఈ శుక్రవారం విడుదల కానున్న తెలుగు చిత్రాల్లో 'కింగ్ జాకీ క్వీన్' ఒకటి. ఇప్పటి విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ చివరిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇదే కావడం. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వెల్లడించిన ఆసక్తికర విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దర్శకుడు కిరణ్ కుమార్ ఈ కథను దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన కిరణ్ కుమార్, కథానాయిక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ అనుష్కశెట్టిని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రూపొందించారట. అయితే వివిధ కారణాలతో ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో సినిమా నిలిచిపోయినా, దర్శకుడు మాత్రం కథను వదిలిపెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేశారని తెలిపారు. మొదట అనుష్క కోసం రాసిన పాత్ర, కాలక్రమేణా మార్పులు చెంది ఇప్పుడు నటి యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపుదిద్దుకుందని సమాచారం. దీంతో ఎన్నో ఏళ్లుగా దర్శకుడు మనసులో ఉన్న కథ చివరకు 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాతో మరో ఆసక్తికర అంశం డా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల ఈ చిత్రంతో హీరోగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. తొలి చిత్రంతోనే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి విభిన్న కథను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది.ఇక హీరో దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, యుక్తి తరేజా కథానాయికగా కనిపించనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు పూర్ణచంద్ర తేజస్వి సంగీతాన్ని అందించారు.

# హారర్, కామెడీ, భావోద్వేగాల కలయిక 'కొరియన్ కనకరాజు'



వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఇండో–కొరియన్ హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు' ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రితికా నాయక్ కథానాయికగా నటించగా, సత్య కీలక పాత్ర పోషించారు. ఎస్. థమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని రాజీవ్ రెడ్డి ఎడుగురు, ప్రమోద్ ఉప్పలపాటి, వంశీ కృష్ణ రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. మనోజ్ రెడ్డి కటసాని సినిమాటోగ్రఫీ అందించగా, సత్య జి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. 123తెలుగు ఈ చిత్రానికి 3.25/5 రేటింగ్ ఇచ్చింది. కథ విషయానికి వస్తే.. కొరియాలో మరణించిన ఓ వ్యక్తి అస్థికలు అనుకోకుండా ఓ కుక్ ద్వారా భారతదేశానికి చేరుతాయి. ఇదే సమయంలో పెనుకొండ ప్రాంతానికి చెందిన కనకరాజు (వరుణ్ తేజ్) తీవ్రమైన కోప స్వభావం కలిగిన యువకుడిగా జీవిస్తుంటాడు. అతని సన్నిహితుడు కిష్టప్ప (సత్య). తన కళ్ల ముందే అన్యాయం జరిగితే సహించలేని కనకరాజు, కొన్ని అనూహ్య పరిణామాల కారణంగా స్థానిక రౌడీలతో గొడవ పడతాడు. మరోవైపు కియా కంపెనీలో ఉద్యోగం చేసే చైత్ర (రితికా నాయక్)ను చూసి ప్రేమలో పడతాడు. ఆమె కూడా కనకరాజుపై ఆకర్షితురాలవుతుంది. అయితే ఒక ఆత్మ కారణంగా కనకరాజు జీవితం ఊహించని మలుపు తిరిగి, అతడు కొరియాకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ ఆత్మ ఎవరిది? గతంలో అతని జీవితం ఎలా ఉండేది? కనకరాజు శరీరంలోకి ప్రవేశించిన ఆ ఆత్మ కోరిక ఏమిటి? ఆ ఆత్మ కారణంగా కనకరాజు ఎలాంటి సమస్యల్లో చిక్కుకున్నాడు? చివరికి ఈ కథ ఎలాంటి ముగింపుకు చేరుకుంది? అనేదే సినిమా ప్రధాన కథాంశం. మరో దేశానికి చెందిన ఆత్మ ఓ తెలుగు కోపిష్టి యువకుడి శరీరంలోకి ప్రవేశిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో దర్శకుడు కథను రూపొందించాడు. హారర్, కామెడీ, భావోద్వేగాలను సమతుల్యంగా మిళితం చేసిన తీరు ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సినిమా కోర్ పాయింట్ బలంగా నిలవడంతో పాటు కనకరాజు పాత్ర, అతనికి సంబంధించిన ఆత్మ ట్రాక్, సత్య పాత్రతో ముడిపడిన కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తాయి. వరుణ్ తేజ్ తన పాత్రలో పూర్తి స్థాయిలో ఒదిగిపోయి నటనతో మెప్పించాడు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలు, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. రితికా నాయక్ సహజమైన నటనతో తన పాత్రకు న్యాయం చేసింది. సత్య తన అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాడు. బుల్లిరాజు తన పాత్రలో మెప్పించగా, వీటీవీ గణేష్‌తో పాటు ఇతర నటీనటులు కూడా తమ తమ పాత్రల పరిధిలో చక్కటి నటన కనబరిచారు. దర్శకుడు మేర్లపాక గాంధీ కొత్త నేపథ్యంతో కథను రూపొందించిన తీరు ప్రశంసనీయం. ముఖ్యంగా హారర్ ఎపిసోడ్‌లను హ్యాండిల్ చేసిన విధానం, క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్టులు ఆకట్టుకుంటాయి. కామెడీ సన్నివేశాలను కూడా సమర్థంగా తెరకెక్కించారు. అయితే కొన్ని కీలక సన్నివేశాలు నెమ్మదిగా సాగడం, సినిమా ప్రారంభంలో ప్రధాన సంఘర్షణ అంతగా ప్రభావం చూపకపోవడం, కొన్ని చోట్ల లాజిక్ లోపించడం వంటి అంశాలు చిత్రానికి ప్రతికూలంగా మారాయి. సాంకేతికంగా కూడా సినిమా మంచి స్థాయిలో ఉంది. దర్శకుడు చెప్పాలనుకున్న హారర్ అంశాలు, భావోద్వేగ కంటెంట్ బాగా ఎలివేట్ అయ్యాయి. అయితే స్క్రీన్‌ప్లే మరింత ఆసక్తికరంగా ఉండి ఉంటే సినిమా ఇంకా మెరుగైన స్థాయికి చేరుకునేది. ఎస్. థమన్ అందించిన పాటలు పర్వాలేదనిపిస్తాయి. మనోజ్ రెడ్డి కటసాని చిత్రీకరించిన సహజమైన లొకేషన్లు, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కెమెరా పనితనం బాగుండగా, సత్య జి ఎడిటింగ్ కూడా సమంజసంగా ఉంది. నిర్మాతలు నిర్మాణ విలువల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించారు. మొత్తంగా చూస్తే 'కొరియన్ కనకరాజు' హారర్, కామెడీ, భావోద్వేగాల సమ్మేళనంగా ప్రేక్షకులను ఆకట్టుకునే చిత్రంగా నిలుస్తుంది. వరుణ్ తేజ్, సత్యల నటన సినిమాకు ప్రధాన బలంగా మారగా, హారర్‌తో పాటు వినోదాత్మక సన్నివేశాలు మంచి అనుభూతిని కలిగిస్తాయి. కొన్ని చోట్ల స్క్రీన్‌ప్లే నెమ్మదిగా సాగడం, లాజిక్ లోపాలు మైనస్‌గా అనిపించినప్పటికీ, ఓవరాల్‌గా ఈ చిత్రం ప్రేక్షకులను బాగానే అలరిస్తుంది.

# చకచకా రాకా మూవీ షూటింగ్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷—లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు డా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందు షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటి ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల డా నిర్ణయించిన సమయాని జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నవంబర్ 6న రామాయణ రిలీజ్



నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'ను ప్రకటించినప్పుడే రెండు భాగాల విడుదల ఎప్పుడనేది చిత్రబృందం వెల్లడించింది. ఈ ఏడాది దీపావళి కానుకగా.. మొదటి భాగాన్ని, వచ్చే ఏడాది దీపావళికి రెండో పార్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు. తాజాగా మొదటి భాగం అధికారిక విడుదల తేదీని చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. నవంబర్ 6న రామాయణను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలుపుతూ పోస్ట్ పెట్టింది అదే రోజున రణ్‌బీర్ కుమార్తె రాహా పుట్టినరోజు కావడంతో ఈ తేదీ ఆయనకు మరింత ప్రత్యేకం కానుంది. ఇక ఈసినిమాలో మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి మాట్లాడారు. ఇది ఎంతో గొప్పగా రూపొందుతోందని.. ప్రపంచదేశాలకు మన సంస్కృతిని తెలియజేయడానికి రామాయణ సరైన కథ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందే కథలను సృష్టించగల సామర్థ్యం భారతీయ సినిమాకు ఉందని చెప్పారు. రూ.4000కోట్లతో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ నటించగా.. సీతగా సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేయగా అది విజువల్ వండర్‌గా యూట్యూబ్ ట్రెండిగ్‌లో నిలిచింది.



# ఆర్‌సీ17లో రుక్మిణి వసంత్?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, స్టార్ దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఆర్‌సీ17పై సినీ వర్గాల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుం టున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా హీరోయిన్ ఎంపికపై ఆసక్తికర చర్చ సాగుతోంది. కన్నడ సినీ పరిశ్రమలో తనదైన గుర్తింపు తెచ్చుకున్న యువ నటి రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కథానాయికగా నటించే అవకాశాలు ఉన్నాయనే వార్తలు ప్రస్తుతం జోరుగా వినిపిస్తున్నాయి. ఇటీవల చిన్న శస్త్రచికిత్స చేయించుకున్న రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూ కోలుకుంటున్నారు. వైద్యుల సూచనల మేరకు కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం ఆయన మళ్లీ షూటింగ్‌లలో పాల్గొననున్నట్లు సమాచారం. ఆరోగ్యం పూర్తిగా కోలుకున్న వెంటనే ఆర్‌సీ17 రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేలా చిత్రబృందం సన్నాహాలు చేస్తోందని తెలుస్తోంది. ఇప్పటికే సినిమా కథ, స్క్రీన్‌ప్లే పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం నటీనటుల ఎంపికతో పాటు సాంకేతిక బృందాన్ని ఖరారు చేసే ప్రక్రియ కొనసాగుతోందని సమాచారం. ఈ నేపథ్యంలోనే హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ పేరు బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న డ్రాగన్ చిత్రంలోనూ ఆమె కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. వరుసగా పెద్ద ప్రాజెక్ట్‌లలో అవకాశాలు దక్కించుకుంటున్న రుక్మిణి.. ఇప్పుడు రామ్ చరణ్‌తో జోడీ కట్టే అవకాశాన్ని అందుకునే దశలో ఉన్నట్లు టాలీవుడ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అయితే, ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. త్వరలోనే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇక ఈ చిత్రానికి సంగీత దర్శకుడి ఎంపిక కూడా ఇంకా ఖరారు కాలేదని తెలుస్తోంది. కథ, సినిమా స్థాయికి తగ్గట్టుగా పాన్ ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకునే సంగీత దర్శకుడిని ఎంపిక చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై కూడా త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.